
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 4 సెప్టెంబరు 2025



తొమ్మిది బార్లకు నోటిఫికేషన్

» 14 వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు గడువు ..15న లాటరీ ద్వారా లైసెన్సులు

ఏలూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో తొమ్మిది బార్లకు రెండో విడతగా గెజిట్ నోటిఫికేషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. గతనెల 18న బార్లకు నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించగా తొమ్మిది బార్లకు దరఖాస్తులు రాలేదు. వీటికి మరల నోటిఫికేషన్ జారీ చేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో ఎనిమిది, జంగారెడ్డిగూడెంలో ఒక బార్‌కు బుధవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెంటెండ్ ఆవులయ్య తెలిపారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో లేదా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీసు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ శనివారపుపేటలోని కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లోను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 15న ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ లాటరీ తీసి లైసెన్సుదారులకు షాపులను కేటాయిస్తారన్నారు.

ఐటీడీఏ డీడీగా జగన్నాథం బాధ్యతల స్వీకరణ



బుట్టాయగూడెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేఆర్ పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు (డిప్యూటీ డైరెక్టర్)గా పిన్నింటి జగన్నాథం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చింతూరు ఐటీడీఏలో ఏపీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఆయన కేఆర్‌పురం డీడీగా వచ్చారు. ఇప్పటి వరకు ఏటీడబ్ల్యువో శ్రీవిద్య ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. మర్యాద పూర్వకంగా పీవో కె.రాములు నాయక్‌ను కలిశారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో భారీగానే వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో జిల్లాలో ముసునూరు మండలంలో 8.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 2.5 మి.మీగా నమోదైంది. లింగపాలెం 7.2, పెదవేగి 6.4, కలిదిండి 6.4, ఉంగుటూరు 5.2, నూజివీడు 5.2, దెందులూరు 4, చాట్రాయి 3.8, కైకలూరు 3.6, కుక్కునూరు 3.4, ఆగిరిపల్లి 2.6, వేలేరుపాడు 2.4, పోలవరం 2.4, బుట్టాయి గూడెం 2.2, ఏలూరు అర్బన్ 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పోలవరం : మండలంలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంలోనే వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల ఏటిగట్టుకి దిగువన ఉన్న ప్రాంతాల్లో నివాసాల్లోకి వర్షపు నీరు చేరింది.

పంచాయతీలకు పండుగ..



15వ ఆర్థిక సంఘ రెండో విడత నిధులు విడుదల

» పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌కు నిధులు
» జిల్లాలోని 544 పంచాయతీలకు రూ. 33.94 కోట్లు
» ఉమ్మడి జిల్లా పరిషత్‌కు రెండు విడతల గ్రాంట్ ఒకేసారి విడుదల

ఎట్టకేలకు 15వ ఆర్థిక సంఘ రెండో విడత నిధులు మంగళవారం విడుదల అయ్యాయి. ఈ గ్రాంటు రావాల్సి ఆరు నెలలు కావొస్తున్నా విడుదల కాక పంచాయతీలు ఆర్థికంగా ఒడిదుడుకులకు లోనయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పంచాయతీలకు కొంత నిధుల కొరత తీరనుంది.

ఏలూరుసిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా ఆర్థిక సంఘ నిధులను దారి మళ్లించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గత వేసవిలో కనీసం మంచినీటి సమస్యలు పరిష్కరించేందుకు నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయతీలు, మండల పరిషత్‌లలో అభివృద్ధి కుంటుపడింది. పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. ఆ ఏడాది మార్చికి ముందే నిధులు విడుదల కావాల్సి ఉంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి 2024 ఫిబ్రవరిలో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు విడుదల అయ్యాయి. ఆ తర్వాత డిసెంబరు, జనవరి నెలల్లో విడుదల కావాల్సిన రెండో విడత నిధులు ఇప్పుడు విడుదల అయ్యాయి. ఈ నిధులను శానిటేషన్‌కు, తాగునీరు, సీసీ రహదారుల నిర్మాణం, విద్యుత్ బిల్లులు, వీధిలైట్లు, చేతి పంపుల మరమ్మతులకు ఖర్చు చేస్తారు. సాధారణంగా ఇప్పుడు 2025-26 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో వేచి చూడాల్సిందే.

544 పంచాయతీలు.. రూ. 33.94 కోట్లు

జిల్లాలో 547 పంచాయతీలు ఉన్నా ఎన్నికలు జరిగిన పంచాయతీలకే ఆర్థిక సంఘ నిధులు విడుదలవుతాయి. ఈక్రమంలో 15వ ఆర్థిక సంఘ రెండో విడతలో భాగంగా జిల్లాలో 544 పంచాయతీలకు 33 కోట్ల 94 లక్షల 85వేల 56 రూపాయలు విడుదల అయ్యాయి. జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి కేటాయించిన నిధుల్లో టైడ్ నిధులు రూ.20,36,90,870 కాగా అన్‌టైడ్ నిధులు రూ.13,57,94,186 విడుదల అయ్యాయి.

జిల్లా పరిషత్‌కు రెండు విడతల నిధులు..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో 2024-25 సంవత్సరానికి (మిగతా 8వ పేజీలో)



సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలపడాలి

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి » ఏలూరు పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

లోపలి పేజీలో..

ఏలూరుకు తప్పిన వరద ముప్పు

» తగ్గిన తమ్మిలేరు.. శనివారపుపేట కాజ్‌వే పైనుంచి రాకపోకలు పునరుద్ధరణ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):తమ్మిలేరు వరద తగ్గుముఖం పట్టడంతో ఏలూరు నగరానికి వరద ముప్పు తగ్గింది. ఏలూరులోని శనివారపుపేట కాజ్‌వే నుంచి రాకపోకలు పునరుద్ధరించారు. నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల తగ్గడంతో ఏలూరులోను తమ్మిలేరు వరద ప్రవాహం తగ్గిందని చెబుతున్నారు. వరద తగ్గడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నా రు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతున్న దృష్ట్యా తమ్మిలేరు బేసిన్‌లో అధిక వర్షాలు కురిస్తే మరల వరద వచ్చే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నాగిరెడ్డిగూడెంలోని తమ్మి లేరు రిజర్వాయర్ వద్ద బుధవారం రాత్రి 10 గంటలకు 347.2 మీటర్లు నీటి మట్టం ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి తమ్మిలేరు ప్రాజెక్టులోకి 450 క్యూసెక్కులు నీరు వస్తుండగా 2,200 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

వారం రోజులుగా..వీడని వరద భయం



కుక్కునూరు తీరంలో నిలకడగా ఉన్న గోదావరి వరద

కుక్కునూరు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి):గోదావరి వరద వారం రోజులుగా నిలకడగా ఉండడంతో ఏజెన్సీ వాసులు కష్టాలు పడుతూనే ఉన్నారు. ఆగస్టు 31వ తేదీన భద్రాచలం వద్ద 47.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. అప్పటి నుంచి ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రభావంతో గోదావరి తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలకు వరదభయం వీడడంలేదు. కుక్కునూరు-దాచారం గ్రామాల మధ్య గుండేటి వాగులో లెవెల్ కాజ్‌వే నీటమునిగే ఉండడంతో వారం రోజులుగా ప్రజలు నల్లగుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని ఎద్దువాగు వంతెన నీటమునగడంతో 20కి పైగా గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఎప్పుడు లేనివిధంగా వారం రోజులుగా గోదావరి వరద నిలకడగా ఉండడంతో ప్రజల్లో భయం నెలకొని ఉంది. ఇప్పటికే నీట మునిగిన పత్తి, జామాయిల్ పంటలను రైతులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరం : అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు నాలుగు రోజులుగా పెరిగిన గోదావరి నీటిమట్టం బుధవారం నాటికి నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 8,84,673 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.60 మీటర్లకు తగ్గింది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.170 మీటర్లు, దిగువన 23.600 మీటర్లు నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు పెరగడంతో గేట్లు మూసుకుపోయి ఏటిగట్టు కుడి వైపున ఉన్న కొండవాగుల జలాల నీటిమట్టం పెరిగి పంటపొలాలు నీటమునిగాయి. నాలుగు రోజులుగా పంటపొలాలు నీట మునిగి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

యూరియా కోసం క్యూ



కుక్కునూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు రైతు భరోసా కేంద్రానికి బుధవారం 300 బస్తాల యూరియా రావడంతో 150 మందికి పైగా రైతులు తరలి వచ్చారు. ఒక్క ఆధార్ కార్డుపై ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తానమడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల సహకారంతో వ్యవసాయాధికారి బాలాజీ రైతులకు యూరియా పంపిణీ చేశారు.

పోలీసుల సహకారంతో..

చింతలపూడి : యూరియా పక్కదారులు పట్టకుండా అమ్మకాలపై పోలీసుల సహకారంతో వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. స్థానిక డీసీఎంఎస్‌కు బుధవారం వెళ్లి రికార్డులు తనిఖీ జరిపారు. వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ డీసీఎంఎస్‌కు 18 టన్నుల యూరియా వచ్చిందన్నారు. వ్యవసాయాధికారి వై.సుబ్బారావు, ఎస్‌ఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అసత్యప్రచారాలు నమ్మొద్దు : జడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు సిటీ : జిల్లాలో రైతులకు యూరియా సరఫరా జరగడం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఖరీఫ్ సీజన్ (2024-25)లో నవంబరు వరకు జిల్లాలో రైతులు వాడిన యూరియా మొత్తం 31 వేలు మెట్రిక్ టన్నులు కాగా ఈ ఏడాదీ అదే స్థాయిలో యూరియా వినియోగం ఉంటుందన్నారు. ఈ సంవత్సరం 2025-26లో ఇప్పటివరకు 28 వేలు మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశారన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు : కలెక్టర్

జిల్లాలో ఎరువుల అక్రమ నిల్వ, అక్రమ తరలింపులపై ప్రత్యేక నిఘా పెట్టి పారదర్శకంగా సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై సెక్రటరియేట్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఎరువుల సరఫరా వివరాలను కలెక్టర్ వివరించారు.

'యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం'

ఏలూరు రూరల్ : రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ ధ్వజమెత్తారు. ఏలూరు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యూరియా కొరత, రైతాంగ సమస్యలపై 9న ఏలూరు ఆర్డీవోను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

శభాష్.. మాస్టార్స్



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. బోధనలో నూతన పద్ధతులను అవలంభిస్తూ.. విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచిన వీరిని సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబరు 5న టీచర్స్ డే సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఈ ఐదుగురు అవార్డులు స్వీకరించనున్నారు. తమకు అవార్డులు రావడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా పశ్చిమ, ఏలూరు జిల్లాల నుంచి ఐదుగురి ఎంపిక

బోధనలో దశాబ్దాల అనుభవం.. ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత..

బోధనలో 40 వసంతాలు



పాలకోడేరు : వేండ్ర జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, శృంగవృక్షం శివారు బంటుమిల్లికి చెందిన ఉపాధ్యాయుడు పంపన సాయిబాబుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 1985లో ఉద్యోగంలో చేరి పెనుగొండ, మొగల్తూరు, వీరవాసరం మండలాల్లో 27 సంవత్సరాలు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఉన్నత పాఠశాలలో ఎన్నో సేవలందించారు. వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ హైస్కూల్‌కు కావలసిన అవసరాలను పూర్వ విద్యార్థుల సహకారంతో తీర్చిదిద్దారు. డిజిటల్ తరగతి గదిని ఏర్పాటు చేశారు. బంటుమిల్లి గ్రామ విద్యా ట్రస్ట్ చైర్మన్‌గా ఉంటూ అక్షర దీక్షలో ఎన్నో సేవలందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకంతోపాటు, కవితలు, గేయాల ద్వారా విద్యార్థులు, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. దీని ఫలితంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నేషనల్ గ్రీన్ కోర్ అవార్డును సొంతం చేసుకున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, జిల్లా ఉత్తమ యూత్ లీడర్, ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, గురుబ్రహ్మ, జ్యోతిరావు పూలే జాతీయ ఆదర్శ ఉపాధ్యాయ, జనచైతన్య ఉపాధ్యాయ రత్న, గురురత్న, జాతీయ విశిష్ట సేవా పురస్కారాలను అందుకున్నారు.ఇలా 200కు పైగా సత్కారాలు అందుకున్నారు.

పీఈటీగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు



భీమవరం టౌన్ : భీమవరం చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాల పీఈటీ గొట్టుముక్కల పూర్ణచంద్రశేఖరరాజు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. భీమవరానికి చెందిన శేఖరరాజు 1998లో ఈ స్కూల్‌లో పీఈటీగా చేరి 27 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. తండ్రి గోవిందరాజు భీమవరం ఎస్‌జీజీఎం పాఠశాల్లో పీఈటీగా చేశారు. ఆయన ప్రోత్సాహంతోనే గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో పీఈటీగా శిక్షణ పొందారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీపీఈడీ, ఉస్మానియా యూనివర్శిటీలో ఎంపీఈడీ చేశారు. పాఠశాల్లోని విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించేవారు. మాల్కంపోల్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్, ఆట్యా పాట్యల్లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించారు. 2008లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. 2011లో ఆంధ్రా యూనివర్శిటీ ఉత్తమ పీఈటీ అవార్డు అందించింది. 1995లో ప్రపంచ జీవ వైద్య సదస్సులో విద్యార్థులతో ప్రదర్శన ఇప్పించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు.

పంచాయతీ కార్యదర్శి నుంచి టీచర్‌గా..



బుట్టాయగూడెం : బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల బయాలజీ స్కూల్ అసిస్టెంట్ టీచర్ గుర్రం గంగాధరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 2006లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయన 2007లో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై జంగారెడ్డి గూడెం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. తర్వాత లక్కవరం, తిరుమలాపురం పాఠశాలల్లో పనిచేశారు. 8, 9 తరగతులకు పాఠ్య పుస్తక రచయితగా వ్యవహ రించారు. ఎస్‌సీఆర్టీ స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా, బయాలజీ రిసోర్స్ పర్సన్‌గా, ఐసీటీలో స్టేట్ రిసోర్స్ పర్సన్ వ్యవహరించారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పేందుకు భారత స్కౌట్ అండ్ గైడ్స్ టీచర్‌గా, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ కో-ఆర్డినేటర్‌గా, బయాలజీ ఫోరం జిల్లా కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక మెంబరుగా పని చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయడం ఈయన ప్రత్యేకత. కష్టపడితే ఏ రంగంలోనైనా ఫలితం దక్కుతుందనడానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడమే నిదర్శనమని అన్నారు. చాలా సంతోషంగా ఉందని, మరింత బాధ్యతగా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తా' అని చెప్పారు.

విద్యార్థుల ప్రగతే ధ్యేయంగా..



లింగపాలెం : రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా రాలకు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం జడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాల ప్రధానోపాధ్యా యుడు షేక్ ఉస్మాన్ పాషా ఎంపికయ్యారు. 2009లో వట్లూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన ఆయన 2017 వరకు అక్కడే పనిచేశారు. తర్వాత 2023 వరకు రంగాపురంలోను, ప్రస్తుతం ధర్మాజీగూడెంలోను పనిచేస్తున్నారు. 2022లో జిల్లా ఉత్తమ టీచర్‌గా అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ గణిత టెక్స్ బుక్ రైటర్‌గా, స్టేట్ మ్యాథ్స్ రిసోర్స్ పర్సన్‌గా, జాతీయస్థాయి దీక్ష ప్లాట్ ఫామ్‌లో కంటెంట్ క్రియేటర్‌గా, ఏలూరు వీసీఆర్ స్టూడియో నుంచి ఆన్‌లైన్ లైవ్ ప్రజెంటర్‌గా, జిల్లాస్థాయిలో 'విజయకేతనం' మెటీరియల్ రిసోర్స్‌పర్సన్‌గా ఇలా అనేక అంశాల్లో విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేసినందుకు ఈ అవార్డు ఆయనను వరించింది. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికవడంతో ఏఈవోలు కె.రామారావు, జె.రవీంద్ర ఆయనను అభినందించారు.

అవార్డుల మాస్టారు..



ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మానూరు ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తేరా ప్రసాద్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం, బోధించే విధానం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. ఎం.ఏ ఇంగ్లీషు, బీ.ఈడి, బి.ఎల్, ఫిలాసఫీ చదివి 32 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 1994లో భీమడోలు మండలం పెద్ద లింగంపాడులో ఆర్.సీఎం స్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. గతంలో మండల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఆయన చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను జిల్లా, రాష్ట్రస్థాయిల్లో 13 అవార్డులందుకున్నారు. పాఠశాల అభివృద్ధి చేయూత అందిస్తున్నారు.

ఆ 27 మందికీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఖాయం!

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన టీచర్లు, హెచ్ఎంల జాబితాను విద్యాశాఖ ఖరారుచేసింది. మొత్తం 25మంది టీచర్లు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేయగా, పోటీ లేకుండానే వీరందికీ పురస్కారాలు దక్కనున్నాయి. ఈ ఏడాది జిల్లాస్థాయి అవార్డులను అన్ని కేటగిరీల నుంచి మొత్తం 60 మందికి ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించినా, టీచర్లనుంచి స్పందన కరవైంది. కేవలం 27 దరఖాస్తులు మాత్రమే అందాయి. దీంతో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల పనితీరు, ప్రతిభ, విద్యారంగానికి వారుచేసిన సేవలు, విద్యాయేతర విషయాల్లో సాధించిన ప్రగతి, తదితర కొలమానాలు, ప్రామాణికతలతో నిమిత్తం లేకుండానే వచ్చిన వారికి వచ్చినట్టు పురస్కారాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రంగాల్లో మంచి పనితీరుని కనబరిచి దరఖాస్తు చేయనివారిని గుర్తించి మరో 10-15మందికి పురస్కారాలు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించినా, ఆ ప్రతిపాదన బుధవారం రాత్రివరకు కార్యరూపం దాల్చలేదు. కాగా దరఖాస్తుచేసుకున్న 27 మంది టీచర్లు, హెచ్ఎంలకు అవార్డులను ఖరారుచేస్తూ సంబంధిత జాబితాపై కలెక్టర్ ఆమోదముద్ర కోసం ఫైలును గురువారం పంపనున్నట్టు తెలిసింది. జిల్లా అధికారుల నుంచి అధికారిక ప్రకటన విడుదల కావాల్సి ఉంది.

ఏలూరు రేంజ్‌లో ఇద్దరు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సీఐలుగా పనిచేస్తున్న వారిలో సీనియార్టీని బట్టి ఎనిమిది మందికి డీఎస్పీలుగా పదోన్నది కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్‌కు చెందిన పి.శ్రీనివాస్ ప్రస్తుతం రాజమహేంద్రవరం రైల్వే సీఐగా పనిచేస్తున్నారు. ఆయన 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన వారు. డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. ఏలూరు రేంజ్‌లోని 1995 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన వి.ఈశ్వరుడు ప్రస్తుతం కాకినాడలోని డీసీఆర్బీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. వీరిద్దరిని మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్ రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుంటూరు రేంజ్‌కు చెందిన నలుగురికి, కర్నూలు రేంజ్‌కు చెందిన ఇద్దరికి కూడా డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించారు. త్వరలోనే వీరికి డీఎస్పీలుగా పోస్టింగులు కల్పించనున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న బుల్లిరాజు



బుల్లిరాజు కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో బాల నటుడు బీమాల రేవంత్ పవన్ సాయి సుభాష్ (బుల్లిరాజు) బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. తల్లిదండ్రులు శ్రీనివాసరావు, దేవి, సోదరి ఆశ్రిత నైనితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీస్సులు అందించారు. అనంతరం ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



కాణిపాకం వినాయకుడికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ద్వారకాతిరుమల ఆలయ ఈవో మూర్తి దంపతులు, అర్చకులు, అధికారులు

శ్రీవారి దేవస్థానం నుంచి
కాణిపాకం గణపతికి పట్టువస్త్రాలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాణిపాకం క్షేత్ర వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం నుంచి అధికారులు, అర్చకులు బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి భాను దంపతులు, ఇతర అధికారులు, అర్చకులు కాణిపాకం వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శిరస్సులపై పట్టు వస్త్రాలను, వివిధ రకాల ఫలాలను ఉంచుకుని వాటిని స్వామివారికి సమర్పించాలని కోరుతూ అక్కడి అధికారులు, పండితులకు అందజేశారు.

నేటి నుంచి అష్టభుజ లక్ష్మీనారాయణ పవిత్రోత్సవాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వైష్ణవ క్షేత్రం అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం (చిన్నగోపురంలో) గురువారం నుంచి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. పవిత్రోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఈవో బిరుదుకోట వీర వెంకట సత్యనారాయణ శంకర్ బుధవారం తెలిపారు. 5 రోజుల పాటు జరిగే ఉత్సవాలు గురువారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమవుతాయని తెలిపారు. 4న ఉదయం శ్రీలక్ష్మీనృసింహ హవనం, సాయంత్రం గరుడ వాహనసేవ, 5న ఉదయం ధృవుల (మూల వరుల) తిరుమంజనం, సాయంత్రం పవిత్ర సమర్పణలు, 6న ఉదయం శ్రీమహాలక్ష్మీహవనం, మధ్యాహ్నం 1గంటకు అన్నకూటోత్సవం, సాయంత్రం పవిత్ర వితరణ, 7న ఉదయం అలంకార తిరుమంజనము, శాంతి కల్యాణం, సాయంత్రం శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

గుడ్డు అధరహో



- హోల్ సేల్ రూ.5.45
- రిటైల్ ధర రూ.6 పైమాటే
- ఊపిరి పీల్చుకున్న పౌల్ట్రీ రైతులు

తణుకు/ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోడ్డు గుడ్డు ధరలు భారీగా పెరిగాయి. వరుస నష్టాలు చవిచూస్తున్న రైతులకు పెరిగిన ధరతో కాస్త ఉపశమనం లభించింది. కొన్ని రోజులుగా గుడ్డు ధర 5.05 పైసల నుంచి పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ధర రూ.5.45 పైసలు ఉంది. రిటైల్ మార్కెట్‌లో 6 రూపాయలకు పైగానే విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు ఎండలు వల్ల తీవ్ర ఇబ్బందులు పడిన రైతులకు ఇపుడు కోలుకునే పరిస్థితి వచ్చింది. వేసవిలో గుడ్లు దిగుబడి తగ్గడంతో పాటు, కోళ్లు చనిపోవడం వల్ల పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు పాలయ్యారు. దానికితోడు బర్డ్‌ఫ్లూ పౌల్ట్రీ రైతులను కుదిపేసింది. ఆ నష్టాల నుంచి ఇప్పటికీ రైతులు కోలుకోలేదు. ప్రస్తుతం వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడడం వల్ల కోళ్లు మేత తినడం ద్వారా ఉత్పత్తి కూడా పెరిగింది. దానికి తోడు గుడ్డు ధర పెరగడం రైతులకు కొంత లాభించింది. ధరలు కొద్దిరోజులు కొనసాగితే పౌల్ట్రీ రైతులకు ఆర్థిక కష్టాలు కొద్దిమేర అయినా తొలిగే అవకాశం ఉంది. నెక్ ప్రస్తుతం ఉన్న ధరను కొంత కాలం పాటు కొనసాగించాలి. అలా కాకుండా ధర తగ్గించే ఆలోచన చేయకుండా ఉండాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన ఉత్పత్తి

వేసవి తర్వాత గుడ్ల ఉత్పత్తి బాగా పెరిగింది. జిల్లాలో కోటి 30లక్షల కోళ్లు ఉన్నాయి. వాటిలో కోటి గుడ్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఉత్పత్తి అయిన గుడ్లు స్థానికంగా 35 లక్షల వరకు వినియోగం అవుతున్నాయి. మిగిలిన 65 లక్షలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. రైతులు ఇప్పటి వరకు నష్టాలను చవిచూసిన వారికి ఖర్చులు పోను రుణాలు తీర్చుకునే వెసులుబాటు కలిగింది.

పెరిగిన ఎగుమతులు

గుడ్లు ఉత్పత్తి అనుగుణంగా ఎగుమతులు కూడా బాగానే ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి 30 లారీల వరకు ఎగుమతి అవుతాయి. ప్రధానంగా బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.

ఆశాజనకంగా కోడి ధర

మాంసం కోసం వినియోగించే ఫారం కోడి ధర కూడా పెరిగింది. గతంలో ఎపుడు ఈ మాదిరి ధరలు లేవు. ప్రస్తుతం ఫారం కోడి కేజీ రూ.97 ధరకు విక్రయిస్తున్నారు. ఈ ధర బ్రాయిలర్ కోడితో సమానంగా పెరుగుతుంది. ఇది కూడా రైతులకు కలసొచ్చే విధంగా ఉంది.



ధర నిలకడగా ఉంది

ప్రస్తుతం గుడ్డ ధర నిలకడగా ఉంది. ఈ ధరతో రైతులకు ఉపశమనం. ఏడాది నుంచి పౌల్ట్రీ పరిశ్రమ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. వేసవి నుంచి ఇబ్బందులే. ఇపుడున్న ధర కొంత కాలం నిలకడగా ఉంటే రైతులకు మేలు జరుగుతుంది. ఇపుడున్న ధరతో కాస్త ఊరట లభిస్తుంది.

కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

పాటే ప్రాణం..





ఆయనకు పాటంటే ప్రాణం.. ఆ ఇంట్లో పాటలు ప్రతిధ్వనిస్తాయి.. గది నిండా గ్రామఫోన్ రికార్డులు.. ఆడియో క్యాసెట్, సీడీ, డీవీడీలతోపాటు ఆధునిక బ్లూరే డిస్క్‌లు కూడా ఉంటాయి. మొత్తంగా వేల పాటలు ఆయన సేకరించారు. తొలుత గ్రామఫోన్ ద్వారా పాటలు వినడం ఆయనకు అలవాటుగా మారింది. ఉదయమే గ్రామఫోన్‌లో పాల వినకుండా ఆయన రోజు ప్రారంభం కాదు. అప్పటి గ్రామఫోన్ నుంచి ఇప్పటి ఆధునిక బ్లూరే డిస్క్‌లో పాటలు వినడం వరకు ఆయన సంగీత అభిమానం కొనసాగుతూనే ఉంది. ఉండి మండలం ఉప్పులూరుకు చెందిన యర్రా కేశవరావు (చిట్టిబాబు) అభిరుచి స్థానికులను కూడా ఆకట్టుకుంది.

- పాటలు వినడం.. సేకరణ ఆయన హాబీ
- గ్రామఫోన్ రికార్డరు నుంచి బ్లూరే డిస్క్‌లు కూడా ఆయన పాటల లైబ్రరీలో ఉన్నాయి
- పాత, కొత్త చిత్ర గీతాలపై మక్కువ
- గ్రామఫోన్‌తో పాటు ఆధునిక ఆడియో ప్లేయర్స్ కూడా కొనుగోలు

ఉండి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామఫోన్ రికార్డుల ద్వారా పాటలను వినడమంటే ఆయనకు మధురానుభూతి. ఇంట్లో వేలాది పాటలు సేకరించి ఉంచుకున్నారు. రోజూ పాటలు వింటారు. బయటకు వెళ్లినా.. ఎవరింటకైనా వెళ్లినపుడు పాటలు వినిపిస్తే టక్కున ఆగి ఆస్వాదిస్తారు. ఎంత ఖర్చు చేసైనా గ్రామఫోన్ రికార్డ్, ఆడియో క్యాసెట్లు, సీడీలు కొనుగోలు చేయడం ఆయనకు అలవాటు.

ఉప్పులూరు గ్రామానికి చెందిన యర్రా కేశవరావు (చిట్టిబాబు) బీకాం చదివారు. వ్యవసాయం చేసుకునే ఆయనకు పాటలు వినడం హాబీ. పాత సినిమా పాటల గ్రామఫోన్ రికార్డులు, ఆడియో క్యాసెట్లు కొనడం, వినడం ఆయనకు ఇష్టం. ఇప్పటివరకు సుమారు 30 వేల ఆడియో క్యాసెట్లు, సీడీలు, డీవీడీలు, వీసీడీలను ఇంట్లో భద్రపరిచారు. గదులలో ప్రత్యేక షెల్ఫ్‌లు, బీరువాలు తయారు చేయించారు. పాత కాలం నాటి గ్రామఫోన్ రికార్డుల నుంచి ఆధునిక బ్లూరే డిస్క్‌ల వరకు ఆయన సేకరణలో ఉన్నాయి. బ్లూరే డిస్క్‌లు రూ.1200 నుంచి రూ.2500 వెచ్చించి కొనుగోలు చేశారు. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు ప్రాంతాల్లో స్నేహితులు, బంధువుల ద్వారా వీటిని సేకరించినట్లు చిట్టిబాబు తెలిపారు. మార్కెట్‌లో ఆడియో క్యాసెట్లు విడుదల కాగానే కొనుగోలు చేస్తారు. ఆయన అభిరుచి తెలిసిన మిత్రులు కూడా ఆడియో క్యాసెట్లు, సీడీలు బహుమతిగా ఇస్తుంటారు.

రఘురామకృష్ణరాజుకు గ్రామఫోన్



ఉప్పులూరు వెళ్లిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును చిట్టిబాబు ఇంటికి ఆహ్వానించారు. ఆయన వద్ద గ్రామఫోన్ రికార్డర్, క్యాసెట్లు చూసి రఘురామ ఆశ్చర్యపోయారు. ఆయన కూడా గ్రామఫోన్ ద్వారా పాటలను విని ఆనందించారు. రఘురామ ఆసక్తిని గమనించి తన వద్ద వున్న గ్రామఫోన్‌ను చిట్టిబాబు బహుమతిగా అందించారు. తర్వాత చెన్నై నుంచి మరొక గ్రామఫోన్ తెప్పించుకున్నారు.



పాత పాటలపై మక్కువ

సంగీత ప్రియుడైన చిట్టిబాబు తెలుగు, హిందీ, తమిళ ఆడియో క్యాసెట్లు, ఆడియో సీడీలను సేకరించారు. పాత పాటలంటే మరింత మక్కువ. ప్రతీరోజు వింటూనే వింటారు. పాండవ వనవాసం, శ్రీకృష్ణపాండవీయం, నర్తనశాల, లవకుశ, విప్రనారాయణ, పాండురంగ మహాత్యం, భక్తప్రహ్లాద వంటి పాత సినిమా పాటలతో పాటు కొత్త సినిమా పాటలు కూడా ఆయన సేకరణలో ఉన్నాయి.

ఆయన తండ్రి యర్రా అయ్యన్న సింగపూర్ నుంచి టేపు రికార్డర్ తెప్పించారు. గ్రామఫోన్‌తో పాటు ఆడియో క్యాసెట్లు వినడానికి పలు రకాల టేపు రికార్డర్లు, సీడీ ప్లేయర్లు కూడా ఆయన వద్ద ఉన్నాయి. ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే గ్రామఫోన్ రికార్డులు ద్వారా పాటలను వినిపిస్తుంటారు.

ఆర్‌ఎంపీ.. పీఎంపీల వైద్యంతో
ప్రాణం పోతోంది..!



ఉమ్మడి పశ్చిమ గోదావరిలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ. ప్రస్తుతం ప్రాథమిక వైద్య చికిత్సల పేరుతో ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్లను పొందినవారు వైద్యుల అవతారం ఎత్తేశారు. కాలు తెగినా కట్టు కట్టాలే తప్ప కుట్లు వేయడానికి అర్హత లేని వారు డాక్టర్ బోర్డులు పెట్టుకుని క్లినిక్‌లు, ల్యాబ్‌లను నిర్వ హిస్తున్నారు. మరి కొంత మంది మెడికల్ షాపులు, ఆసుపత్రులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సినిమాలో శంకర్‌దాదా ఎంబీబీఎస్ చేయడానికి మోసం చేస్తే నిజ జీవితంలో ఆర్‌ఎంపీలు ఏకంగా వైద్యం చేసేస్తున్నారు.! అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కొన్ని చోట్ల ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

- చీమకుట్టినా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్
- బలవుతున్న ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రజలు
- విచ్చలవిడిగా క్లినిక్, ల్యాబ్‌లు
- కొందరు పీఎంపీ, ఆర్‌ఎంపీలు లక్షాధికారులు!

- ఉంగుటూరు మండలానికి చెందిన ఒక వైద్యుడు ఆర్‌ఎంపీలపై హైకోర్టులో కేసు వేయగా ఆర్‌ఎంపీలు సొంతంగా వైద్యం చేయకూడదని, క్వాలిఫైడ్ ఎంబీబీఎస్ వైద్యులు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్‌లోని మందులను, ఇంజక్షన్లను మాత్రమే చేయడానికి రోగికి సలహాలు ఇవ్వాలే తప్ప వారు సొంతంగా ప్రిస్క్రిప్షన్ రాయకూడదని తీర్పు ఇచ్చారు. సుప్రీంకోర్టు కూడా ఇలాంటి తీర్పులే ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు లక్షాధికారులుగా మారిపోతున్నారు.
- జంగారెడ్డిగూడెం మండలంలోని ఒక ఆర్‌ఎంపీ వల్ల ఒక వ్యక్తి కళ్లు పోగొట్టుకున్నాడు. మరో యువకుడు మోకాళ్లు అరిగిపోయాయి.
- గిరిజన ప్రాంతంలో ఒక మహిళ ఆర్‌ఎంపి వైద్యురాలి చేతిలో గిరిజన మహిళ ప్రాణాలే కోల్పోయింది.
- ఈనెల 2న ఏలూరులో ఒక మహిళ జ్వరం వచ్చిందని వంగాయిగూడెంలో ఉన్న ఆర్‌ఎంపీ సురేష్‌బాబు అలియాస్ నాని వద్దకు వెళ్లగా రెండు ఇంజక్షన్లు చేసి ప్రాణాలు గాలిలో కలిపేశాడు.
- ఏలూరులోని ఒక ఆర్‌ఎంపీ మూడేళ్ల పసిబిడ్డకు వైద్యం చేసి ప్రాణాలు గాలిలో కలిపేశాడు. చివరకు ఆ కుటుంబానికి లక్షల పరిహారం చెల్లించుకుని పోలీస్ కేసు నుంచి బయటపడ్డాడు.

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు ఐదు వేల మందికిపైగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలుగా పనిచేస్తున్నారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులుగా అవతారం ఎత్తి సూపర్ స్పెషలిస్టులుగా వెలుగొందే ప్రయ త్నాలు చేస్తూ ప్రజలపై తమ వైద్య ప్రయోగాలు చేస్తున్నారు. మరికొంత మంది తమ హస్తవాసి మంచిదంటూ ఆపరేషన్లు కూడా చేసి ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళ ప్రభుత్వ వైద్యులు, క్వాలిఫైడ్ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తెల్లవారితే వారి గుమ్మంలో వాలుతున్నారు. సమయానికి వైద్యం చేయడంతో ప్రజల్లో వారిపై నమ్మకం కలుగుతోంది.

యాంటీభయాటిక్స్

కొందరు ఆర్‌ఎంపీలు ప్రమాదకర యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ రాస్తున్నారు. చీమకుట్టి దద్దుర్లు వచ్చినా ఇవే. ఉమ్మడి జిల్లాలో పది శాతం సాధారణ మరణాలు జరిగితే పరోక్షంగా ఆర్‌ఎంపీల ప్రభావం 50 శాతం ఉంటుందని చెప్పవచ్చు. వారు ఇచ్చిన స్టెరాయిడ్స్, అత్యధిక పవర్ కల్గిన యాంటీబయోటిక్స్ వల్ల తదుపరి వైద్యం చేయడానికి ఆస్కారం లేకుండా పోతుంది.

కార్పొరేట్ హాస్పిటల్స్‌తో ఒప్పందం

కొంత మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని తమ ప్రాంతాల నుంచి రోగులను పంపించి పర్సంటేజీలను అందుకుంటున్నారు. ఇంకా కొంత మంది ఆర్ ఎంపీలు, పీఎంపీలు జనరిక్ మందులను కొనుగోలు చేసి ప్రజలకు ఇచ్చి అడ్డంగా సొమ్ములను వసూలు చేసుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతం, గిరిజన ప్రాంతాల్లో వారి హవా ఎక్కువ.

వృద్ధుల ప్రాణాలతో చెలగాటం

కొంత మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు వృద్ధుల ప్రాణాలతోనే చెలగాటం అడుతున్నారు. వృద్ధులు దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్లలేక, తమ కుటుంబ సభ్యులకు ఖాళీలేక ఊరిలో ఆర్‌ఎంపీలను ఆశ్ర యిస్తున్నారు. ఇదే అదునుగా వారు ఆ క్షణంలో ఆర్‌ఎంపీలు సూపర్ స్పెషలిస్టులుగా అవతారం ఎత్తి యాంటీబయోటిక్స్‌ను, స్టెరాయిడ్స్‌ను ఇవ్వడంతో వారు కోలుకుంటున్నారు. కానీ చాపకింద నీరులా ఆ మందులు వాడినకి వ్యాధి నిరోధక శక్తి క్రమేపీ తగ్గిపోతుంది. తరువాత చిన్న వ్యాధిని కూడా తగ్గించు కోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యం చేయించుకున్న వారికి 15 ఏళ్లలోపే షుగరు, బీపీలు వస్తున్నాయని ఇటీవల ఒక పరిశోధనలో స్పష్టమైంది. ఉమ్మడి జిల్లాలో అధికారుల తనిఖీలు లేవు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి



ఆర్‌ఎంపీ, పీఎంపీల వైద్య సేవలపై సుప్రీం కోర్టు, హైకోర్టు ఎన్నో తీర్పులు వెలువరించాయి. ప్రభుత్వాలు అమలు చేయకపోవడం వల్ల ప్రజలు ప్రాణాలకు ముప్పు తలెత్తింది. అరకొర పరిజ్ఞానంతో కొంత మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ ఇచ్చేస్తున్నారు. దీనివల్ల ఆ పేషెంటుకు భవిష్యత్తులో ఎలాంటి వ్యాధి వచ్చినా మందులు పనిచేయడం లేదు. ఆర్‌ఎంపీల వైద్యం వికటించి ప్రాణాలు పోతున్నాయి. తెలిసీతెలియని వైద్యంతో మానవ శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతోంది. దీనివల్ల చిన్న వయసులోనే షుగరు, బీపీ, కిడ్నీలు పోవడం, కాలేయం వంటి అవయవాలు, ఎముకల వ్యాధులు వస్తున్నాయి. ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలి.

డాక్టర్ సి.శ్రీనివాసరాజు, వైస్ చైర్మన్, హాస్పటల్స్ బోర్డు ఆఫ్ ఇండియా

తనిఖీ నిర్వహించి చర్యలు చేపడతాం

కొయ్యలగూడెం, ఏలూరులో ఇటీవల జరిగిన ఘటనలు బాధాకరం. జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులను ఏర్పాటుచేసి వైద్యం చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. విస్తృత తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం.

- పీజే.అమృతం, డీఎంహెచ్‌వో, ఏలూరు

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ వైద్యంతో ఒక మహిళ మృతి చెందడంతో ఏలూరు వన్‌టూన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పువీధి మేకలకబేళా ప్రాంతానికి చెందిన కటారి భారతి లక్ష్మి (25)కి భర్త వెంకటేశ్వరరావు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. మూడు రోజుల నుంచి ఆమె జ్వరంతో బాధపడుతోంది. వంగాయగూడెంలో ఆర్‌ఎంపి గంచరి సురేష్‌బాబు అలియాస్ నాని క్లినిక్ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం అతని వద్దకు భారతి లక్ష్మిని తీసుకువెళ్లగా రెండు ఇంజక్షన్లు చేశాడు. కొద్ది సేపటికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వైద్యుడిని అడిగితే ఏమి కాదని కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎంతసేపటికి ఆమె మేల్కొనక పోవడంతో అక్కడి నుంచి ఏలూరు టూటౌన్ పరిధిలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని నాని క్లినిక్ వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, సిబ్బంది పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి బుధవారం కూడా పోస్టుమార్టం నిర్వహించలేదు. పంచనామా జరిపి గురువారం పోస్టుమార్టం నిర్వహించడానికి పోలీసులు చర్యలు చేపట్టారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరిరామజోగయ్య, శ్రీనివాస్

6న లఘు చలన చిత్ర పోటీలు

- పాలకొల్లులో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్
- పోటీలకు 12, ప్రత్యేక జ్యూరీకి 6 చిత్రాలు ఎంపిక

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో 4వ అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు ఈనెల 6న నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. సంస్థ ముఖ్య సలహాదారు చేగొండి వెంకట హరిరామ జోగయ్య నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని, పోటీలకు 90 లఘు చిత్రాలు రాగా 12 చిత్రాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. మరో 6 లఘు చిత్రాలను ప్రత్యేక జ్యూరి ప్రదర్శనకు ఎంపిక చేశామన్నారు. ప్రథమ స్థానం పొందిన చిత్రానికి రూ.లక్ష, ద్వితీయ చిత్రానికి రూ.75వేలు, తృతీయ చిత్రానికి రూ.50వేలు నగదు బహుమతి, మిగిలిన 9 చిత్రాలకు రూ.5వేలు చొప్పన షీల్డ్, ప్రశంసాపత్రం, ప్రత్యేక జ్యూరి ప్రదర్శనకు ఎంపికైన వాటికి షీల్డ్, ప్రశంసాపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. హరిరామ జోగయ్య మాట్లాడుతూ పోటీలను మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణరాజు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రారంభిస్తారన్నారు. పాలకొల్లు కేంద్రంగా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించాలన్నదే తమ ధ్యేయం అన్నారు. ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ మాట్లాడుతూ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దర్శకులు రేలంగి నరసింహారావు, వీరశంకర్, వీఎన్ ఆదిత్య, బీవీఎస్ రవి, సిరాశ్రీ, రాజా వన్నెంరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. కాగా పోటీల సందర్భంగా ఫిల్మ్ నగర్ కల్చరల్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరాజుకు విశిష్ట సేవాభూషణ్ పురస్కారం, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు విశేష ప్రతిభా పురస్కారాన్ని అందించనున్నట్టు తెలిపారు. ప్రముఖ సినీ దర్శకుడు బి.గోపాల్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేశిరాజు రాంప్రసాద్, గుడాల హరిబాబు, చవాకుల నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన చిత్రాలు : తీరం చేరని కెరటం, చివరి శ్వాస, పదిలం, మమ్మీ మహాలక్ష్మి, సైబర్ స్లావరీ, నీకోసం, సమతుల్యం, దియా, సరిహద్దు, మార్పు నీకోసం కాదు... రేపటి కోసం, 733, బాలిగాడు.

ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు : మధులిక, చిన్ని, చిన్ని మనసులు, మైత్రీ, దేశానికి రైలే ప్రాణం, కనిపించని త్యాగం, జయహో



జెండా ఊపి రన్ ప్రారంభించిన జిల్లా వైద్యాధికారి గీతాబాయి

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన..
భీమవరంలో 5కే రన్

భీమవరంటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సూచనల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భీమవరం ఏరియా ఆసుపత్రి భీమవరం వద్ద హెచ్‌ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు, సామాన్య ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు బుధవారం 5కే రన్ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ఈ.గీతాబాయి జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు హెచ్‌ఐవి, ఎయిడ్స్ దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మంచి దేహదారుఢ్యం కోసం రోజు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఎక్సర్‌సైజ్ చేయాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.అ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటే మంచి భవిషత్ ఉంటుందని ఆకాంక్షించారు. ఎయిడ్స్‌పై అవగాహన, నిర్మూలనలో విద్యార్థులు చాలా ప్రముఖ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి టౌన్ పోలీసు స్టేషన్, రిజిస్టర్ ఆఫీసు, ప్రకాశం చౌక్, టౌన్ హాల్ మీదుగా సాగిన రన్ తిరిగి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుంది. రన్‌లో బాలుర విభాగంలో మొదటి బహుమతి ఎం లీలా గణేశ్, రెండో బహుమతి బి.సుభేష్ గెలుపొందారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి ఎం.జీవరాణి, రెండో బహుమతి బి.బేబీ శివాని గెలుపొందారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ మధుసూదనరావు, సీఎస్‌వో సాక్షి గోపాల్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ ఎం.గోవిందబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిసెంబరు 7న జరిగే పరీక్షకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో గురువారం నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్.ఆశ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు నమోదు సమయంలో ఆధార్ కార్డులో వున్న విధంగా విద్యార్థి పేరు, పుట్టినతేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3.50లక్షల లోపు ఉన్న విద్యార్థులు అర్హులని వివరించారు. దరఖాస్తు సమయంలో ధ్రువపత్రాలు అవసరం లేదని, పరీక్షరాసే సమయానికి మాత్రం అన్ని సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష రుసుం ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఏటా రూ.12వేలు ఉపకార వేతనం అందుతుందని వివరించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా క్షేత్రస్థాయిలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు ప్రోత్సహించాలని కోరారు. పరీక్ష 7, 8 తరగతుల సోషల్ సైన్సెస్, సైన్సెస్, గణితం సబ్జెక్టులపై 90 మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్స్ రూపంలో ఉంటుందన్నారు.



నారాయణపురం వంతెనకు మరమ్మతులు

- నాలుగు నెలల క్రితం వంతెనకు రంధ్రం
- అప్పటి నుంచి పెద్ద వాహనాల రాకపోకలు నిలిపివేత
- ఎమ్మెల్యే చొరవతో ఎట్టకేలకు పనులు ప్రారంభం

ఉంగుటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):భీమవరం-ఉండి ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉంగుటూరు మండలం నారాయణపురం వంతెనపై నాలుగు నెలల క్రితం రంధ్రం పడింది. అప్పటి నుంచి భీమవరం వెళ్లే పెద్ద వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వంతెనపై కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే అనుమతిస్తున్నారు. వంతెన స్లాబును తొలగించి కుంగిన ప్రాంతంలో తాత్కాలిక స్లాబు నిర్మించడం ద్వారా తేలిక పాటి వాహనాల రాకపోకలకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం దారి మళ్లించి చేబ్రోలు పోలీసు స్టేషన్ పక్క నుంచి వెళ్లడానికి మార్గం సుగమం చేశారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంగళవారం కాల్వ గట్టు వెంబడి రహదారిలో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.



కంసాలిపాలెం వద్ద ఎర్రకాలువ ఉధృతి పరిశీలిస్తున్న అధికారులు

ఉధృతంగా ఎర్రకాలువ ప్రవాహం

- నిలిచిపోయిన రాకపోకలు
- ఉభయ గోదావరి జిల్లాల వాసుల పాట్లు

నిడదవోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎర్ర కాలువకు వరద నీరు చేరడంతో నీటి ప్రవాహం పెరిగింది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నిడదవోలు మండలం కంసాలిపాలెం, తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య ఎర్రకాలువ ఉంది. ప్రస్తుతం మూడు వేల క్యూసెక్కుల నీరు ఈ ప్రాంతంలో ప్రవహిస్తుందని, దీంతో ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించవద్దంటూ అధికారులు చుట్టుపక్కల గ్రామాల్లో దండోరా వేయించారు. ప్రస్తుత వర్షాలతో నీటి ప్రవాహం మరింత పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మండపాక పాఠశాలకు క్రీడా పురస్కారం

తణుకు రూరల్, సెప్టెంబు 3(ఆంధ్రజ్యోతి):తణుకు రూరల్ మండలం మండపాక జడ్పీ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. 2024-25లో క్రీడల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి విజయాలకు గానూ పురస్కారం దక్కినట్లు తెలిపారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులకు పురస్కారం అందజేస్తారని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యానారాయణను గ్రామ సర్పంచ్ జానా వెంకట లక్ష్మీ, పాఠశాల కమిటీ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, జానా శ్రీనివాసు అబినందించారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాల, సంస్థ ప్రతినిధులు

పరిశోధన-ఆధునిక ఆవిష్కరణలపై
ఎన్‌ఐటీటీఆర్, సీఆర్ఆర్ కళాశాల ఒప్పందం

పెదపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, చెన్నైలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ అండ్ రీసెర్చ్ సంస్థతో అవగాహన ఒప్పందం బుధవారం జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఒప్పందంలో భాగంగా పరిశోధన, అధ్యాపకులకు శిక్షణ, జాయింట్ కన్సల్టెన్సీ ప్రాజెక్టులు, ఆధునిక ఆవిష్కరణలు, సాంకేతిక విద్య మొదలైన అంశాలకు సంబంధించి ఇరు సంస్థలు వనరులు, అనుభవాలు, నైపుణ్యాలను పరస్పరం పంచుకుంటాయని తెలిపారు. దీనిద్వారా విద్యార్థులకు నూతన సాంకేతిక అంశాలపై విస్తృతమైన అవగాహన, అపరిమిత ఉపాధి నైపుణ్యాలు మెరుగుపడతాయని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. అవగాహన ఒప్పందంలో సీఎస్ఈ హెచ్‌వోడీ ఎన్ దీపక్, ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు డి.అజయ్‌కుమార్, ఎన్‌ఐటీటీఆర్ ప్రతినిధిగా ప్రొఫెసర్, డైరెక్టర్ ఉషానటేశన్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.





ఏలూరులో ఛాయ్ పే చర్చా, శోభాయాత్రలో మాధవ్, ఎమ్మెల్యే కామినేని, తపనా చౌదరి, అంబికా కృష్ణ తదితరులు

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలపడాలి

- అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తాం
- ఆక్వా, నిమ్మ మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగు పరుస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఏలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'బీజేపీలో బూత్‌స్థాయి నుంచి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. ఒక కార్యకర్తగా ఉంటూ అంచెలంచెలుగా రాష్ట్ర పగ్గాలు అందుకున్న నేనే అందుకు ఉదాహరణ' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. సారథ్యం యాత్రలో భాగంగా ఆయన బుధవారం ఏలూరులో పర్యటించారు. ఉదయం ఏలూరు బిర్లాభవన్ సెంటర్‌లో ఛాయ్ పే చర్చలో పాల్గొని పేదల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అణగారిన వర్గాల గుర్తింపునకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని స్వాతంత్ర్య సమరయోధుడు మూర్తి రాజు విగ్రహానికి, పాత బస్టాండ్ వద్ద బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి మాధవ్, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, గారపాటి తపనాచౌదరి, అంబికా కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్ నుంచి జూట్‌మిల్లు వరకు బ్యాండ్ మేళాలు, నృత్యప్రదర్శనలు, నాయకులు, కార్యకర్తలతో కలసి మోదీ మాస్కులను ధరించి సాగిన శోభాయాత్రను నగరంలో రక్తి కట్టించారు.

ప్రజల్లో మమేకం కావాలి

బైపాస్ రోడ్డులో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అధ్యక్షతన సారథ్యం - జిల్లా పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ 'త్యాగం, కృషి, పట్టుదల, క్రమశిక్షణ, బలిదానాలే ప్రధాన ఆయుధంగా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మమేకం కావాలి. రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధి పథకాల్లో సింహభాగం కేటాయించడంలో మోదీ ప్రభుత్వం ముందుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలి. పోలవరం ప్రాజెక్టు మరింత వేగవంతానికి రూ.15 వేల కోట్లు కేంద్రం ఇచ్చింది. కొల్లేరులో మూడు లక్షల మంది పేదలకు న్యాయం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం సమిష్టి కృషి వలన రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఆక్వా, నిమ్మ ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరుస్తాం. ఆక్వా కల్చర్ అభ్యున్నతి, రవాణా, ఇతర సౌకర్యాలకు రాబోయే రోజుల్లో రూ.550 కోట్లతో ఒక ప్రణాళికను రూపొందిస్తాం. జిల్లాలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'మని మాధవ్ అన్నారు.

కొల్లేరు సమస్య పరిష్కరించాలి

బీజేపీ కార్యకర్తగా పనిచేయడం వల్లే 11 ఏళ్లలో ఎంతో మంది జిల్లా నుంచి నేతలు జాతీయ స్థాయిలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఎదిగిన విషయాన్ని గుర్తెరిగి.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్దులు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపనా చౌదరి, నిర్మలా కిషోర్ అన్నారు. 'కొల్లేరు కాంటూరు కుదింపు సమస్యను పరిష్కరించాలి. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అప్రోచ్ రోడ్లు నిర్మాణం చేపట్టాల'ని జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ కోరారు. నీతి నిజాయితీలతో నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులను వెతికి వారికి పదవులు ఇచ్చి సముచిత గౌరవం ఇస్తున్న పార్టీ బీజేపీయే.. అందుకు నిదర్శనం బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లే అని పార్టీ రాష్ట్ర ముఖ్య ఆహ్వానితులు అంబికా కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. కొల్లేరు కాంటూరు కుదింపు సాధ్యం కాదని, అయితే జిరాయితీ, పట్టా భూముల్లోని వేలాది మందికి న్యాయం చేసే పని కేంద్రం చేస్తుందని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సాయంత్రం కొత్తబస్టాండ్ ప్రాంతంలో అంబికా కృష్ణ ఆధ్వర్యంలో మేధావులు, పురప్రముఖులు, పారిశ్రామికవేత్తలతోను మాధవ్ సమావేశం అయ్యారు. సెంట్రల్ కమిటీ సభ్యులు మధుకర్‌జీ, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు సునీల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు శరణాల మాలతీరాణి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీప్రసన్న నాగోతి రమేష్ నాయుడు, జిల్లా కార్యదర్శి గాది రాంబాబు, కొరశ్ల సుధాకరకృష్ణ, జిల్లా పార్టీ ఇన్‌చార్జి నరేంద్రప్రకాష్, కట్నేని లక్ష్మీప్రసాద్, ఇందుకూరి అశోక్‌చక్రవర్తి, కారంకి శ్రీనివాస్, నగరపాటి సత్యనారాయణ, గుమ్మడి చైతన్య, నారాయణ పాల్గొన్నారు.

మరింత చేరువలో వైద్య సేవలు

ఏలూరు రూరల్ : ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను అనుసంధానించి వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఏలూరు బిర్లా భవన్ హోటల్ వద్ద జరిగిన 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో కలసి టీ తాగి పలు విషయాలపై వారితో చర్చించారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే జ్యోతి కృష్ణ పాల్గొన్నారు.

చించినాడ వంతెనకు కొత్త రూపు

- పెరిగిన ట్రాఫిక్‌ను తట్టుకునే విధంగా పనులు
- అక్టోబర్ చివరి నాటికి పూర్తి : ఎన్‌హెచ్ అధికారులు

నరసాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):నూతన టెక్నాలజీతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల మధ్య వున్న దిండి-చించినాడ బ్రిడ్జి మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 216 జాతీయ రహదారిపై వున్న ఈ వంతెన నిర్మించి 28 ఏళ్లు దాటింది. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా వంతెనను పటిష్ఠ పర్చాలని ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించారు. కొత్త టెక్నాలజీని ఉపయోగించి పిల్లర్లపై ఉన్న వంతెన రోడ్డును పటిష్ఠ పరుస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 50 బేరింగ్‌లను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో కొత్త బేరింగ్‌లను అమరుస్తున్నారు. అక్టోబరు చివరి నాటికి పనులు పూర్తి చేస్తామని ఎన్‌హెచ్ ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికే వంతెన మూసి వేసి నెల రోజులు దాటింది. ఒకటిన్నర కిలోమీటరు పొడవైన ఈ వంతెనపై ప్రస్తుతం వున్న బేరింగ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల గడ్డర్లు పోయాయి. అవసరమైన చోట్ల గడ్డర్లను మారుస్తున్నారు. మచిలీపట్నం ప్రాజెక్టు అధికారి పర్యవేక్షణలో చేపడుతున్న ఈ పనులకు రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. పాతికేళ్ల వరకు ఎలాంటి రిపేర్లు చేపట్టే అవసరం లేకుండా పటిష్ఠంగా పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వారంలో రెండు, మూడు రోజులు ట్రాఫిక్ ఆపి పనులు చేస్తున్నారు. మరికొన్ని రోజులు వంతెనలో సగభాగాన్ని ఆపి ఓవైపు నుంచే వాహనాలకు అనుమతి ఇస్తున్నారు.



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

ఏలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):పలు కార్పొరేషన్లకు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని పలువురిని డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పోలవరానికి చెందిన పాదం నాగకృష్ణ(జనసేన), చింతలపూడికి చెందిన పల్లి శ్రీనివాసరావు(టీడీపీ), ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా పోలవరానికి చెందిన పెండ్యాల రమాదేవి(టీడీపీ), ఏపీ కుమ్మరి, శాలివాహన వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా ఉంగుటూరుకు చెందిన భీమవరపు లక్ష్మి(టీడీపీ), ఆచంటకు చెందిన కొడేటి లక్ష్మి కనకదుర్గ(టీడీపీ), నాటక అకాడమీ డైరెక్టర్‌గా తణుకుకు చెందిన కలగర వెంకటకృష్ణ(టీడీపీ), ఏపీ స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమవరానికి చెందిన షబీనా మహ్మద్(టీడీపీ), ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌గా ఆచంటకు చెందిన కడాలి నాగలక్ష్మి(టీడీపీ), ఏపీ గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్లుగా తణుకుకు చెందిన కట్నం విశాలాక్షి(జనసేన), దెందులూరుకు చెందిన ముమ్మడి సక్కుకుమారి(టీడీపీ) నియమితులయ్యారు.

డీఎస్సీ జాబితా నుంచి ఇద్దరు బధిర అభ్యర్థుల తొలగింపు?

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన ఉమ్మడి జిల్లా రెండో విడత అభ్యర్థులకు మంగళవారం ఏలూరులో నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో వైకల్య (పీహెచ్) కేటగిరీలో ఇద్దరు వినికిడి లోపం గల వారిని తిరస్కరించి నట్టు తెలిసింది. సర్టిఫికెట్ల పరిశీలనకు మొత్తం 33 మంది హాజరు కాగా, వీరిలో ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ కేట గిరీలోవున్న ఆరుగురు అభ్యర్థులకు అకడమిక్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ను చేపట్టిన అనంతరం వైకల్య నిర్ధారణ నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు పంపించారు. మెడికల్ బోర్డు పరిశీలనకు వచ్చిన వారిలో ఇద్దరికి డీఎస్సీ మార్గదర్శకాల మేరకు నిర్ణీత వైకల్య శాతం లేకపోవడంతో వారిని తిరస్కరించినట్టు సమాచారం. ఆ మేరకు వారి స్థానంలో తదుపరి మెరిట్‌లో వున్న మరో ఇద్దరిని శుక్ర లేదా శనివారాల్లో జారీ చేయనున్న మూడో విడత కాల్‌లెటర్ల జారీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తారని తెలిసింది. ఇద్దరు హెచ్ఐ అభ్యర్థుల వైకల్య శాతం తిరస్కారంపై అధికారిక సమాచారమేదీ లేదు.

బైక్ చక్రం ఊడిపోతోందంటూ..

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):'సార్.. మీ బైక్ చక్రం బోల్టు లూజయ్యి ఊడిపోయేలా ఉంది.. బండిని ఆపండి.. చూద్దామం'టూ నమ్మబలికిన ఘరానా మోసగాళ్లు.. బండిని ఆపిన తర్వాత ద్వారకాతిరుమలకు చెందిన ఓ వ్యాపారి సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. ఈ ఘటన ఏలూరు ఆశ్రం వద్ద చోటు చేసుకోగా బాధిత వ్యాపారి బుధవారం ఉదయం ద్వారకాతిరుమల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ద్వారకాతిరుమలలోని ఓ ఫంక్షన్ హాల్ వ్యాపారి కోరుప్రోలు సత్యనారాయణ మంగళవారం మధ్యాహ్నం కొనుగోళ్ల నిమిత్తం ఏలూరుకు తన బైక్‌పై బయల్దేరాడు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్దకు వచ్చేసరికే పక్కనుండి మరో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు సదరు వ్యాపారి బండి ఆపేలా చేశారు. ఒక యువకుడు కిందికి దిగి బైక్ చక్రం తిప్పండని వ్యాపారికి సలహా ఇచ్చాడు. మరో యువకుడు బైక్‌పైనే ఉన్నాడు. దీంతో సదరు వ్యాపారి బైక్ చక్రం తిప్పేందుకు కిందికి వంగిన వెంటనే చొక్కా జేబులోని సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. వ్యాపారి వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వ్యాపారి బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

పోలవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):పోలవరం పంచాయతీ బాపూజీ కాలనీలో అద్దెకు ఉంటున్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా పొట్టిలంక గ్రామానికి చెందిన నాగవరపు సతీశ్ ప్రాజెక్టులో ఎక్స్‌కవేటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు బాపూజీ కాలనీలో అద్దెకు ఉంటున్న ఇంటి ఎదుట పార్కు చేసిన మోటార్‌సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. స్థానిక సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఒ వ్యక్తి బైకుని తీసుకెళ్లడాన్ని గుర్తించారు. ఈ ఘటనపై పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

కృష్ణా కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):నగరం నడిబొడ్డులో ఉన్న కృష్ణా కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని ఏలూరు టూటౌన్ పోలీసులు గుర్తించారు.ఏలూరు నగరంలోని వసంతమహల్ సెంటర్ సమీపంలో టాక్సీస్టాండ్ వద్ద కృష్ణాకాలువ నుంచి దుర్గంధం వెదజల్లడంతో బుధవారం ఉదయం పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నీటిలో కుళ్లిపోయి ఉన్న మృత దేహాన్ని బయటకు తీశారు. సుమారు 45 సంవత్సరాలు కల్గిన ఆ వ్యక్తి వంటిపై చొక్కా లేకుండా ప్యాంటు ఒకటే ఉంది. నాలుగు రోజుల క్రితం నీటిలో పడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ప్రస్తుతం వినాయక విగ్రహాల నిమజ్జనాలు గత నెల 29వ తేదీ నుంచి జరుగుతున్న నేపథ్యంలో కాలు జారి ప్రమాదవశాత్తు నీటిలోపడి మరణించి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. తూర్పులాకుల నుంచి మృతదేహం కొట్టుకు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల రెండు రోజుల క్రితం వరదలు రావడంతో ఈ మృత దేహం కొట్టుకొచ్చి ఉండవచ్చని భావిస్తున్నాడు. మృతుడి ఆచూకీ తెలియరాలేదు. ఏలూరు టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

ముదినేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి 2020లో గుడివాడలోని ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ కోసం వెళ్లగా జంగారెడ్డిగూడెం మండలం కొయ్యలగూడేనికి చెందిన ఎ.దివాకర్ అనే యువకుడు పరిచయమయ్యాడు. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నట్టు యువతి పోలీసులను ఆశ్రయించింది. ఆమె తల్లి కూడా ఆ యువకుడిని నిలదీయగా కుటుంబ సభ్యులతో సహావచ్చి పెళ్లి చేసుకుంటామని చెప్పి వెళ్లారని అన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రశ్నించగా పెళ్లికి నిరాకరిస్తున్నాడని, తనను మోసం చేశారని ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యాసిడ్‌దాడి కేసులో ముగ్గురికి జీవితఖైదు

హైకోర్టును ఆశ్రయించినా మళ్లీ అదే శిక్ష ఖరారు - ఇద్దరు నిర్దోషులుగా విడుదల



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో 2023లో ఒక వివాహితపై జరిగిన యాసిడ్ దాడి కేసు రాష్ట్రంలో సంచలనం కలిగించింది. ఆ కేసులో శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినా, ముద్దాయిలు హైకోర్టులో అప్పీలు చేసుకోవడంతో ఆ శిక్షను రద్దు చేసి పునఃవిచారణను జిల్లా కోర్టులో నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణలో కూడా ముగ్గురికీ యథావిధిగా జీవితఖైదు విధిస్తూ ఏలూరులోని ఎస్సీఎస్టీ కోర్టు కం ఎనిమిదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.ఏలూరు విద్యానగర్ మానిస్ట్రీ సమీపంలో నివాసముంటున్న యడ్ల ప్రాంచినమ్మ అలియా ప్రాంచినా(38)కి భర్త ఆంజనేయులుతో వివాహం కాగా గొడవల కారణంగా విడిపోయి ఐదేళ్ల కుమార్తెతో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆమె చెల్లి యడ్ల సౌజన్య కూడా అదే ఇంట్లో ఉంటోంది. వారి ఇంటి వద్ద పనికి వచ్చిన ఏలూరు కొత్తగూడానికి చెందిన బోడా నాగ సతీశ్ అనే వ్యక్తి సౌజన్యతో సన్నిహిత సంబంధం పెట్టుకున్నాడు. తరచుగా వారి ఇంటికి రావడంతో ప్రాంచినమ్మ అతడిని మందలించింది. దీంతో ఆమెపై కక్షపెంచుకున్నాడు. ఏలూరు గ్రేవియర్ నగర్‌లోని ఒక క్లినిక్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తూ 2023 జూన్ 13వ తేదీ రాత్రి తన స్కూటర్‌పై ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు అకస్మాత్తుగా ఆమెపై యాసిడ్ పోశారు. తీవ్రంగా గాయపడటంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ నేరానికి పాల్పడిన బోడ నాగ సతీశ్, అతడి స్నేహితులైన ఏలూరు వైఎస్సార్ కాలనీకి చెందిన బెహరా మోహన్, బూడిద ఉషా కిరణ్‌లను అరెస్టు చేశారు. వీరికి సహకరించిన మరో స్నేహితుడు షేక్ కాజాబాబు, యాసిడ్ విక్రయించిన కొల్లా త్రివిక్రమరావు, అతని వద్ద పని చేసే వ్యక్తి వీడెల సత్యానారాయణలను కూడా అరెస్టు చేశారు.ఈ కేసు ఏలూరులోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణ సాగింది. బోడ నాగ సతీశ్, బెహరా మోహన్, బూడిద ఉషాకిరణ్‌లకు జీవితఖైదు విధించారు. అయితే వీరు హైకోర్టును ఆశ్రయించగా పునఃవిచారణ జరపాలని ఆ తీర్పును రద్దు చేశారు. దీంతో నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసు ఏలూరులోని 8వ అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు పునఃవిచారణ చేసి జడ్జి శ్రీనివాసమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులైన బోడ నాగ సతీశ్, బెహరా మోహన్, బూడిద ఉషా కిరణ్‌లకు మళ్లీ పాత శిక్ష అయిన జీవిత ఖైదు విధించారు. ఒకొక్కరికి రూ.30వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 9 నెలల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలన్నారు. యాసిడ్ విక్రయించిన కొల్లా త్రివిక్రమరావుకు రూ.1500 జరిమానా విధించారు. మృతురాలి బంధువులకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. యాసిడ్ తీసుకొచ్చిన షేక్ కాజాబాబు, షాపులో పనిచేసే వ్యక్తి వీడెల సత్యనారాయణలపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదల చేసినట్టు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ శారదామణి వాదించగా ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, అప్పటి ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఇంద్రశ్రీనివాస్, అప్పటి ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు కేసు దర్యాప్తునకు సహకరించారని తెలిపారు.

● సత్ఫలితాలిస్తున్న మానిటరింగ్ సెల్

ముద్దాయిలు చట్టం నుంచి తప్పించుకోకూడదనే ఉద్దేశంతో జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కిశోర్ తెలిపారు. దీని ద్వారా చక్కటి సత్ఫలితాలు వస్తున్నాయని, 2022-23లో 14 కేసులు విచారించగా 18 మందికి శిక్షలు పడ్డాయన్నారు. కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసిన తరువాత 2024 నుంచి 2025 సెప్టెంబర్ వరకూ 31 కేసుల్లో 38 మందికి శిక్షలు పడ్డాయన్నారు.

అనుమతి లేకుండా కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం

రిటైరైన ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వో, మరో ముగ్గురుపై క్రమశిక్షణ చర్యలు! - ఎంపీహెచ్‌ఏ(మేల్) నియామకాలే కారణం



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఆరుగురు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగాలను భర్తీ చేశారన్న అభియోగాలపై ఉమ్మడి జిల్లా పూర్వపు డీఎంహెచ్‌వోతో పాటు, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవో(ఎఫ్‌ఏసీ), ఒక సూపరింటెండెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్లపై సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణ చర్యలకు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పొరుగు జిల్లాలో పనిచేస్తూ గతనెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన డీఎంహెచ్‌వోపై ఇప్పుడు అభియోగాలు/క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగాల కోసం న్యాయ స్థానాన్ని ఆశ్రయించి ఉత్తర్వులను పొందిన ఆరుగురు నిరుద్యోగ అభ్యర్థులు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నియామకాల కోసం సంప్రదించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వ అనుమతి ఉండాలి.ఈ నియమాన్ని ఉల్లంఘించి ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఆరుగురు అభ్యర్థులకు కోర్టు ఉత్తర్వులు ఆధారంగా ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వో సంబంధిత అభ్యర్థులకు కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగాలిచ్చేశారని గతేడాది అభియోగాలు నమోదయ్యాయి. ఈ నియామకాల్లో డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనాధికారి, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ల ప్రమేయం కూడా ఉన్నట్టు గమనించిన ఉన్నతాధికారులు తదుపరి చర్యలను చేపట్టారు. సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీచేయగా, వీరిద్దరూ కోర్టు నుంచి స్టే ఉత్తర్వులను రెండు నెలల క్రితం పొంది డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే ప్రస్తుతం విధులు నిర్వర్తిసున్నారు. ఈ నియామకాల్లో తన ప్రమేయం లేదని వివరణిచ్చుకున్న పరిపాలనాధికారి పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు డీఎంహెచ్‌వో కూడా గత నెలాఖరున రిటైరయ్యారు. ఈ నేపథ్యంలో వీరందరిపై గతంలో నమోదైన అభియోగాల మేరకు ఇపుడు క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే రిటైరైన డీఎంహెచ్‌వోపై క్రమశిక్షణచర్యలు అనివార్యమైతే పెన్షన్‌లో కొంతమొత్తాన్ని కోతవిధించడం లేదా నిలిపివేయడం జరిగినా కోర్టును ఆశ్రయించే అవకాశాలు లేకపోలేదని సమాచారం. ఇక మిగతా ముగ్గురుకి పదోన్నతి, ఇంక్రిమెంట్లలో కోత వంటి చర్యలు ఉండవచ్చునని, ఈ చర్యలు తీసుకుంటే వీరుకూడా న్యాయస్థానం తలుపులుతట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

శ్రీవారి దర్శనం క్యూలో తాచు పాము కలకలం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దర్శనం క్యూలైన్‌లో తాచు పాము ప్రత్యక్షమై కలకలాన్ని రేకెత్తించింది. రూ.200 దర్శనం క్యూలైన్‌లో బుధవారం మధ్యాహ్నం గోధు మరంగు తాచుపాము కనిపించడంతో భక్తులు హడలి పోయారు. దానిని హతమార్చడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. జన సంచారం ఉన్న ప్రాంతం కావడంతో అంతా హడలిపోయారు.



ఏసీల రిపేర్‌పై యువతకు ఉచిత శిక్షణ

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు రిఫ్రిజిరేషన్, ఏయిర్‌కండిషన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ తెలిపారు. జిల్లాకు చెందిన వారై ఉండి 19 నుంచి 45సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. కనీసం 5వ తరగతి చదివి తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 95027 23561 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీకి ప్రతినిధుల ఎన్నిక

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విద్యారంగ వ్యతిరేకవిధానాలపై నూతనంగా ఎన్నికైన విద్యార్థి కమిటీ కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివ కుమార్ సూచించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘ నూతన కమిటీకి ఎన్నికలు, సమావేశం జరిగాయి. నూతన కమిటీ ప్రతినిధులుగా సూర్య ప్రకాశ్, అబ్దుల్ రహీమ్, వీర సంతోశ్, బాలు, రఘునాథ్, సంతోశ్, రాకేశ్, కార్తీక్, పవన్, నాగ సంతోశ్, నవీన్, దివాకర్, సిరివెన్నెల, దీన, జ్యోతి, సిరి, మహేశ్వరి, ప్రతిభ, వర్ధిని, చంద్రకాంత్, చరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సంఘ జిల్లా కోశాధికారి క్రాంతి కుమార్ తెలిపారు.

ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు సూచనలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆత్మహత్యల నివారణ అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అనుబంధ విభాగం జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం(డీఎంహెచ్‌పీ)నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.హన్నాకోమలి, క్లినికల్ సైకాలజిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి నివారణ, ఆత్మహత్య ఆలోచనల నియంత్రణ, మానసిక ఆరోగ్యం గురించి సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు, సామాజిక కార్యకర్త తిరుపతిస్వామి, బి.ఫార్మ్, ఫార్మ్‌డి విద్యార్థులు పాల్గొన్నారు.



పవిత్రాలను శిరస్సుపై ఉంచి కోవేల ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

శ్రీవారికి ఘనంగా పవిత్రోత్సవం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద 24వ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్వామికి పవిత్ర సమర్పణ నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన కుంభస్థాపన, అగ్ని ప్రతిష్టాపన, చతుష్టానార్చనం, పంచాదశ కలశ స్నపనం జరిపారు. అనంతరం శ్రీహయగ్రీవ హవనాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, వేద పండితులు శ్రీమాన్ యనమండ్ర వేంకట రవి ప్రకాశ్ శర్మ అవధాని, నాలాయిర ప్రబంధ పారాయణ గ్రహీత మధురైకి చెందిన శ్రీమాన్ కె.ఇ.బాలాజీలు భక్తులతో పూజలు చేయించారు. ఎమ్మెల్యే వెంట నగర పాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఏలూరు అర్బన్ యుడా ఛైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, ఆర్.కె.ప్రసాద్ - రమాదేవి పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, సిబ్బంది గంగాధరరావులు సేవలందించారు.

చింతలపూడిలో క్రికెట్ కోర్టు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ కోర్టును ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. కుక్క, పాము కాటుకు సంబంధించిన వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక 25,26 వార్డుల్లో రూ.47 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షల 90 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, నాయకులు పెనుమర్తి రామ కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, రాపూరి కృష్ణ, అబ్బిన దత్తాత్రేయ, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, రాజాన పండు, కౌన్సిలర్లు కరుటూరి రమాదేవి, టి.జ్యోతి, సొసైటీ ఛైర్మన్ మానికల నాగేశ్వరరావు, పాతూరి అంబేద్కర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఏలూరుటూటౌన్/దెందులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడేవారికి సీఎం సహాయ నిధి సంజీవని వంటిదని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.



చెక్కులు అందజేస్తున్న దెందులూరు నాయకులు

బుధవారం 22మందికి రూ.8 లక్షల 52వేలు చెక్కులు అందించామన్నారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి శివారు కొత్తకమ్మవారిగూడెంలో తూంపాటి పద్మకు, పుసులూరి నాగరాజుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్‌లు బుధవారం అందజేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పర్సా వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదా రులకు అందజేశారు. పార్టీ గ్రామ కార్యదర్శి తుంపాటి ఆంజనేయులు, పుసులూరి యుగం ధర్, పంచాయతీ వార్డు సభ్యులు సుంకవల్లి మధు, వాకులపూడి రత్తయ్య ఉన్నారు.



విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరులోని పవర్ పేట శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ ధర్మసత్రం ఛైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సత్రం ఛైర్మన్ యాలబాక కృష్ణతో ఎమ్మెల్యే చంటితో పాటు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈడ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ కార్పొరేటర్ కర్రీ శ్రీనివాస్, మారం అను, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సింహాద్రి కనకరాజు కనకాచారి మాట్లాడుతూ ఎన్నికల ముందు విశ్వబ్రాహ్మణులకు టీడీపీ ఎన్నో హామీలు ఇచ్చారని ఇచ్చిన హామీలు అన్ని చట్టాలుగా తయారు చేసి విశ్వబ్రాహ్మణ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు డాక్టర్ చింతాడ బ్రాహ్మనందం, కేకేఎస్ సంస్థల అధినేత రాంబాబు పాల్గొన్నారు.

పంచాయతీలకు పండుగ..

(5వ పేజీ తరువాయి)

సంబంధించి 15వ ఆర్థిక సంఘ నిధులు విషయానికొస్తే గతంలో మొదటి విడత నిధులు కూడా విడుదల కాలేదు. ఇప్పుడు రెండు విడతల నిధులు ఒకేసారి విడుదల అయ్యాయి. 15వ ఆర్థిక సంఘం రెండు విడతలు కలిపి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌కు 21 కోట్ల 99లక్షల 60వేల 360 రూపాయలు విడుదల అయ్యాయి. ఇందులో మొదటి విడత నిధులు 13,76,87,261 రూపాయలు కాగా ఇందులో అన్‌టైడ్ నిధులు రూ.5,50,73,271, టైడ్ నిధులు రూ.8,26,13,990 విడుదల అయ్యాయి. రెండో విడత నిధులు రూ.8,22,73,099 నిధులు విడుదల కాగా ఇందులో అన్‌టైడ్ నిధులు 3,29,09,240 రూపాయలు, టైడ్ నిధులు 4,93,63,959 రూపాయలు విడుదల అయ్యాయి.

మండల పరిషత్‌లకు రూ.16.50 కోట్లు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి రెండోవిడత గ్రాంట్ మొత్తం రూ.16,50,97,853 నిధులు విడుదలయ్యాయి. ఇందులో అన్‌టైడ్ నిధులు రూ.6,60,39,122, టైడ్ నిధులు రూ.9,90,58,731 విడుదల అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంది.



టి.నరసాపురంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసిత రైతులు



కొయ్యలగూడెంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

సర్వీసు రోడ్డు ఇవ్వాల్సిందే

» గ్రీన్ ఫీల్డ్ హైవే రైతుల ఆందోళన

» అధికారులకు అర్జీల అందజేత

టి.నర్సాపురం, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీసు రోడ్డు ఇవ్వాల్సిందేనని గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో టి.నర్సాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బుధవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యల పరి శీలనకు తహసీల్దార్, హైవే అధికారులు రోడ్డు నిర్మాణ సంస్థ బెకం కంపెనీ ప్రతినిధులు, బృందం పరిశీలనకు వచ్చారు. మండలంలోని టి.నర్సాపురం, గుర్వాయి గూడెం, ఏపి గుంట, మధ్యాహ్నపువారిగూడెం, వెంకటాపురం, బొర్రం పాలెం, తదితర గ్రామాల వద్ద భూనిర్వాసిత రైతులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. అన్ని చోట్ల రైతుల సమస్యలు చెప్పడంతో నివేదికలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల రైతులు ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వీసు రోడ్డులో గ్రావెల్ వేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. టి.నర్సాపురం 112వ అండర్ పాస్ వద్ద సర్వీసు రోడ్డు గుండా వెళ్లే అవకాశంలేకుండా పోయిందన్నారు. కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణం చేయలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పుట్లగట్టగూడెం సమీపంలో..

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండలంలోని పుట్లగట్టగూడెం సమీపంలో గ్రీన్ ఫీల్డ్ రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు. సర్వీసు రోడ్ల ప్రొవిజన్ కల్పించాలని, సర్వీసు రోడ్లలో మొక్కలు నాటవద్దని నినాదాలు చేశారు. జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజి రైతుల వద్దకు వచ్చి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పుట్లగట్లగూడెం వద్ద ఎగ్జిట్ పాయింట్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వామిశెట్టి హరిబాబు, శీలం రామచంద్రరావు, పి.హరి, గోలి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

అధికారులకు రైతుల వినతి..

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మాణం పూర్తి చేసుకుంటున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని బాధిత రైతులు తహసీల్దార్‌కు,హైవే ఇంజనీరింగ్ అధికారులకు వినతి పత్రాలిచ్చారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నవించడంతో అధికారులు స్పందించి బుధవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాంతాలను తహసీల్దార్ నాగ రాజు నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు.గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని రైతులు వేడుకున్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతులు కొడవటి రామ కృష్ణ, పసల శ్రీను, మార్ని శ్రీను ఉన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనాలు



నిమజ్జనానికి తరలిపోతున్న గణపతి

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద, కుండీ సెంటర్‌లోని హేలా పురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. కుండీ సెంటర్ వద్ద జరిగే నవరాత్రి ఉత్సవాల్లో స్వామికి బుధవారం 108 కిలోల గణపతి మహాలడ్డూను నివేదనగా ఏర్పాటు చేశారు. రామకోటి ప్రాంగణంలో జరుగుతున్న గణేశ్ నవరాత్రుల్లో బుధవారం స్వామికి భక్తబృందం గరికతో అర్చన జరిపారు.

● ద్వారకాతిరుమల: స్థానిక ఆర్చిగేటు సెంటర్ మందిరంలో కొలువుదీరిన గణనాథుడిని బుధవారం నృశింహసాగరంలో నిమజ్జనం చేశారు.ముందుగా మందిరం వద్ద నిర్వాహకులు పూజలు నిర్వహించారు. క్షేత్ర పురవీధుల్లో ఊరేగించారు. ప్రతీ ఇంటి ముందు స్వామి వారికి భక్తులు హారతులు పట్టారు.

● పోలవరం: పట్టిసీమ ఫెర్రీరేవులో గణపతి నిమజ్జనాలు బుధవారం ఘనంగా జరిగాయి. పాతపోలవరం, నూతనగూడెం, ప్రగడపల్లి,రేపల్లెవాడ, ఎల్.ఎన్.డి. పేట గ్రామస్తులు తాము ప్రతిష్టించిన ప్రతిమలను ట్రాక్టర్లపై ఊరేగింపు నిర్వహించి నిమజ్జనాలు చేశారు బెస్తవీధిలో భారీ అన్నదానం నిర్వ హించారు. కొత్తగుండు సాయికృష్ణ, ఉప్పలపు సత్తిరాజు పాల్గొన్నారు. పోలవరం ఎస్.ఐ. పవన్ కుమార్ ఆధ్వ ర్యంలో పోలీసులు విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

● లింగపాలెం:మండల వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. లింగపాలెం మండల వ్యాప్తంగా జరుగుతున్న నిమజ్జనాల్లో ఎస్ఐ కె.వెంకన్న తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

● చింతలపూడి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానాలు జరిగాయి.వెలమపేటలో ఏకదంత యూత్ కమిటీ అన్నదానాన్ని నిర్వహించగా, ప్రగడవరం బీసీ కాలనీలోని మండపంలో భారీగా అన్నదానం నిర్వహించారు.

● టి.నర్సాపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు బుధవారం మండలంలోని బొర్రంపాలెం, వీరభద్రవరం, కేతవరం తదితర గ్రామాల్లో భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం గణనాథుడిని పురవీధుల్లో ఊరేగించి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం : శక్తిటీమ్



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలున్నాయని, వాటిపైన అవగాహన పొంది ఆపద సమయంలో వినియోగించుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, శక్తి టీమ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు సూచించారు.జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు సత్రంపాడులో ఉన్న యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న యువతులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు, బాలికలు, యువతుల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో రక్షణ చర్యలు చేపట్టిందని దానిలో భాగంగానే శక్తియాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ మొబైల్లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, హింసకు పాల్పడినా, ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా వెంటనే ఆ యాప్‌లోని సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెళ్తుందని, పది నిముషాల వ్యవధిలోనే పోలీసులు చేరుకుంటారన్నారు. లేదా 112కు అయినా కాల్ చేయాలని వివరించారు.ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సర్వమాల ధారులకు నిత్య భిక్ష ఏర్పాటు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకోటి ప్రాంగణంలో అక్టోబరు 13వ తేదీ నుంచి అన్నపూర్ణా సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో నిత్య భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అన్నదాన సమాజం నిర్వాహకులు కొట్టు మధు వెంకట్రావు తెలిపారు. భిక్ష కార్యక్రమంలో సేవలు అందించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 27న రాటా ముహూర్తం నిర్ణయించామన్నారు. అక్టోబరు 13న శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించి అనంతరం భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, నవంబరు 18న అయ్యప్పస్వామికి శాకాంబరి అలంకారం జరుపుతామన్నారు. అనంతరం భిక్ష కార్యక్రమం బ్రోచర్లను ప్రతినిధులు ఆవిష్కరించారు. సమావేశంలో అన్నదాన సమాజం ప్రతినిధులు వై.సుబ్బారావు, మారం జయసూర్య, కొట్టు మనోజ్, మద్దుల గోపాల్, కొట్టు అప్పారావు, గాదంశెట్టి రమేష్‌కుమార్, సుంకర రాంబాబు, చింతా దుర్గేష్, ఎల్.కిరణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ వేగవంతం



సరిపల్లెలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

చింతలపూడి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగంగా జరుగుతోంది. ఎర్రగుంటపల్లి గ్రామంలో మాజీ జడ్పీటీసీ తాళ్లూరి రాధారాణి మూడవ రేషన్ డిపో పరిధిలో పంపిణీ చేయగా, శివపురంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. సీతానగరంలో టీడీపీ నాయకులు కక్కిరాల నాగేశ్వరరావు, ముత్తా శేఖర్ స్మార్ట్ కార్డులు అందజేశారు. ప్రగడవరంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి కార్డులు పంపిణీ చేశారు. మేడిశెట్టివారిపాలెంలో కార్డులు అందజేశారు.

● కొయ్యలగూడెం: స్మార్ట్‌కార్డుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి అన్నారు. ఈ మేరకు మండలంలోని సరిపల్లె గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అధికారులు, కూటమి నాయకులు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించవద్దని కోరారు. వీఆర్వో అడపా రాంబాబు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: మండలంలోని వెలగపాడు, కేతవరం పంచాయతీల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తుల ఆధ్వర్యంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మల్లుకుంట సొసైటీ ఛైర్ పర్సన్ శీలం సాయి వినయ్, వెలగపాడు సర్పంచ్ నైనారపు జలపాలు, కేతవరం ఉపసర్పంచ్ భీమవరపు జగన్మోహనరావు, జోనుబోయి భాష, నాగార్జున, పెద్దిరాజులు, గిరి, సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: స్మార్టు రేషన్ కార్డులతో సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా జరుగుతుందని విజయరాయి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు రావిపాటి పిచ్చియ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో బుధవారం స్మార్టు కార్డులను పంపిణీ చేపట్టారు. పార్టీ నాయకులు పెదర్ల నానీ, ఈడ్పుగంటి గిరిబాబు, బిర్లంగి పెద్దులు, ఆర్.దుర్గాప్రసాద్, జనసేన నాయకుడు మేడిచర్ల కృష్ణ పాల్గొన్నారు.

● భీమడోలు: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులను సద్వినియోగపర్చుకోవాలని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులో పలు ప్రాంతాల్లోని లబ్దిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ జరిగింది. పూర్తిస్థాయి పారదర్శకతతో రేషన్ పంపిణీకి స్మార్ట్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో కామవరపుకోట నాయకులు

మాధవ్‌తో మండల నాయకుల భేటీ

కామవరపుకోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):బీజేపీ బలోపేతానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పర్యటన ఎంతో సహకరిస్తుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. బుధవారం మాధవ్ ఏలూరు నగరంలో పర్యటించిన సందర్భంగా నాయకులు కొద్దిసేపు ఆయనతో భేటీ అయ్యారు. కామవరపుకోట అధ్యక్షులు ఎస్.ఆర్.ఆర్.ఎల్.ఎస్. ఎన్.రాజు, ఏలూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, జీలకర్ర గూడేనికి చెందిన బాహుబలేంద్రుని బాలవర్ధి రాజు, మండల కిసాన్ మోర్చ అధ్యక్షులు మంటా సురేశ్ కుమార్, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షులు వరప్రసాద్, ఉపాధ్యక్షుడు మురళీ వర్మ, సుబ్బారావు, జనరల్ కార్యదర్శి లక్ష్మీపతి ఉన్నారు.

కొల్లేరు సమస్యలపై జడ్పీ ఛైర్ పర్సన్ వినతి ..



ఏలూరు సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్‌ను జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కొల్లేరు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రైతులు పంట నష్టాలు, జీవనోపాధి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు. దీనికి మాధవ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కూడా కొల్లేరు సమస్యపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను వివరించారు. ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహనకు వీధినాటకం



అవగాహన కల్పిస్తున్న బృందం

పెదవేగి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివా హాలతో కలిగే అనర్థాలపై అవగాహన అవసరమని ఐసీ డీఎస్ విజయరాయి సెక్టారు సూపర్‌వైజర్ కె. మేరీబాయి అన్నారు. చైల్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాప్)ఆధ్వర్యంలో పెదవేగి మండలం రాయన్న పాలెం జడ్పీ ఉన్నతపాఠశాలలో బాల్య వివాహ వ్య తిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన నిర్వ హించారు. సూపర్‌వైజర్ మేరీబాయి మాట్లాడుతూ కనీస వివాహ వయస్సు రాకుండా వివాహం చేస్తే కలిగే సంతానం ఆరోగ్యంపై ప్రభావం పడుతుంద న్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కె.జె.పావని మా ట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. నిర్ణీతవయస్సు రాకుండా వివాహం చేస్తే వారి భావి జీవితాలను చేజేతులా నాశనం చేసినవారవుతారని ఆమె చెప్పారు. బాల్య వివాహాలను నిరోధించడంలో తల్లిదండ్రుల పాత్రే కీలకమని,వారిలో చైతన్యం తీసుకొస్తే నిర్మూలించగలమన్నారు. సమాజంలో బాలికలపై వివక్షలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు, సిబ్బంది ఆర్.వినోద్ కుమార్, జి.రాజ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎ.హెప్సిబా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి సాయం

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): పేద యువతి వివాహానికి ఏలూరు రూరల్ మండలం కొల్లేరు టీడీపీ సీనియర్ నాయకుడు సైదు గోవర్ధన్ రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని లింగారావుగూడెం గ్రామానికి చెందిన శీలం బిక్షం, మేరి దంపతుల కుమార్తె నాగలక్ష్మీ వివాహం విషయాన్ని గోవర్ధన్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. గత 15 ఏళ్ళుగా పేద యువతులకు పెళ్ళి కానుక పేరుతో ఆర్థిక సాయం అందిస్తున్న గోవర్ధన్ పలువురు ప్రశంసించారు.

ఎరువులు అతిగా వాడొద్దు

దెందులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అవసరమైన మేరకే ఎరువులు వాడాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎల్.శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం మండలంలోని జోగన్నపాలెంలో ఉద్యనవన శాఖ అధికారి బి.కరణ్‌లతో కలిసి ఆయిల్‌పామ్, నిమ్మ, అరటి తోటలు పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.అనంతరం జోగన్నపాలెంలో పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు.

రాయపాటి శైలజకు కేబినెట్ హోదా పట్ల సర్వత్రా హర్షం

దెందులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దెందులూరు గ్రామానికి చెందిన ప్రముఖ టీడీపీ మహిళా నాయకురాలు, ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. మద్దిపాటి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, బ్రహ్మయ్య అండ్ కో ఆడిటర్ మద్దిపాటి సీతారామ్మోహన్‌రావు, విజయవాడ రమేశ్ గుండే ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ పోతినేని రమేశ్, సినీహీరో పోతినేని రామ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, మోతుకూరి నాని, బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి, ఏపీ యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మహేశ్ యాదవ్, ఇప్పిలి వెంకటేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు.



భగవద్గీత పారాయణ

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విష్ణు పరివర్తన ఏకాదశి పర్వదిన సందర్భంగా పార్శ్వ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహిళలు సామూహికంగా భగవద్గీత పారాయణ నిర్వహించారు. స్వామికి తులసీదళాలు, పుష్పాలతో అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. గోవిందనామ సంకీర్తనలను ఆలపించి భజనలు నిర్వహించి ఏకాదశి పర్వదినంలో పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన ధర్మాజీగూడెం రోడ్డు

వర్షాలకు రోడ్డు అధ్వానం

లింగపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధర్మాజీగూడెం నుంచి అయ్యప్పరాజుగూడెం వెళ్లే రోడ్డు పలు చోట్ల కోతకు గురవ్వడంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ప్రగతిపురం, కలరాయనగూడెం, అయ్యప్పరాజుగూడెం గ్రామాలతో పాటు పలు కాలనీల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వెళ్లాలన్నా, వ్యవసాయ పనులు, ఇతర అవసరాలపై వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి.. కోతకు గురైన ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా స్థానికులు రాళ్లు అడ్డుపెట్టారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రాహ్మణుల సమస్యలపై వినతి

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రంలో బ్రాహ్మణుల సమస్యలపై విన్నవించారు. శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐకాస నాయకులు కె కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నిబద్ధత గల నేత సురవరం

కుక్కునూరు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): నిబద్ధతగల కమ్యూనిస్టు సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. బుధవారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ తొలినాళ్ల నుంచి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని అన్నారు. అలాగే ఆయనకు ఉన్న ఆస్తులను ప్రజలకు ధారదత్తం చేసి ప్రజాసేవలో నిమగ్నమైన నిబద్ధతగల నేత అని కొనియాడారు. సీపీఐ నాయకులు కొన్నే లక్ష్మయ్య, ఐతా సురేశ్, బాబురావు, సీపీఎం నాయకులు వై.నాగేందర్, రమేశ్, వైసీపీ నాయకులు అల్లేశ్, చంటి నాయుడు, రాయి రవి, కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజులు, రఘు, వీరయ్య పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన

భీమడోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాలు వాటి ఆవస్యకతపై కురెళ్లగూడెం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. న్యూట్రిషియన్ వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మణరావు టీకాలు, తల్లి బిడ్డ ఆరోగ్యానికి రక్షణ అని, వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు వేయించాలన్నారు. టీకాలు వేయిస్తేనే చిన్నారి భవిష్యత్తుకు భద్రత అని పేర్కొన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసరావు, గంగాభవానీ, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు తోటపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీ సురక్ష మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ గుడివాడ సౌజన్యంతో తోటపల్లిలోని బ్లెస్సింగ్ బేతేలు సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు సాల్మన్‌రాజు అన్నారు. సెప్టెంబరు 5న తోటపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు.

నేడు దసరా మహోత్సవాలను రాట ప్రతిష్ఠ

కైకలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ మహాయాగసహిత శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. గురువారం ఉదయం 10.55 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేతల మీదుగా రాట ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులంతా పెద్దఎత్తున తరలిరావాలని ఈవో కోరారు.

సహకార సంఘాల నుంచి యూరియా పంపిణీ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఈదులగూడెం, ఆగిరిపల్లి, కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా అందుబాటులో ఉన్నదని మండల వ్యవసాయ అధికారి జె.భవాని అన్నారు. ఈదులగూడెం పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈదులగూడెం పీఏసీఎస్‌లో 11.250 మెట్రిక్ టన్నులు, కృష్ణవరం పీఏసీఎస్‌లో 11.250 మెట్రిక్ టన్నులు, ఆగిరిపల్లి పీఏసీఎస్‌లో 11.000 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ సెంటర్లో 15.000 మెట్రిక్ టన్నులు మొత్తం మండలంలో 48.500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని తెలిపారు. అడవినెక్కలం, ఈదర సహకార సంఘాలలో రేపటినుండి యూరియా అందుబాటులో ఉంటుందని రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఈదులగూడెం పీఏసీఎస్ చైర్మన్ ఈలప్రోలు శ్రీనివాసరావు, పీఏసీఎస్ సిఈవో జాలిపర్తి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

సీబీ కెనాల్‌కు నీటి విడుదల చేయండి



కలిదిండి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరు లాకుల వద్ద సీబీ కెనాల్‌కు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని కోరుతూ బుధవారం విజయవాడలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావుకు కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు వినతిపత్రం సమర్పించారు. జిల్లాకు శివారున ఉన్న కలిదిండి మండలానికి తగినంత సాగు, తాగునీరు రాకపోవటంతో పలు ఇబ్బందులు పడుతు న్నామన్నారు. 750 క్యూసెక్కుల నీరును విడుదల చేయాల్సి ఉండగా, కేవలం 300 నుంచి 400 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారని దీంతో శివారు గ్రామాలకు సాగు, తాగు నీరు సరఫరా చేయటం లేదన్నారు. చినగొన్నూరుతోపాటు పలు గ్రామాల్లో సీబీ కెనాల్ గట్లు 7 కిలోమీటర్ల మేర బలహీనంగా ఉండటంతో గండ్లు పడే అవకాశం ఉందన్న కారణంతో సాగు, తాగునీరు సరిపడనంత వదలటం లేదన్నారు. గట్లను పటిష్టం చేసి సీబీ కెనాల్‌కు నీటి విడుదలకు చర్యలు తీసుకుంటానని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ హామీ ఇచ్చారని తెలిపారు.

రూ. 2 కోట్లతో రహదారి నిర్మాణ పనులు



చాట్రాయి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరం-తుమ్మగూడెం గ్రామాల మధ్య రూ. 2 కోట్ల పంచాయతీ రాజ్ నిధులతో రహదారి నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ రహదారి పూర్తిగా శిథిలమై ప్రజలు అవస్థలు పడుతుండడంతో మంత్రి పార్థసారథి చొరవతో నిధులు మంజూరు అయ్యాయి. బొడ్డురాయి సెంటర్ నుంచి గ్రామం చివర వరకు 450 మీటర్లు సీసీ రోడ్డు, అక్కడి నుంచి తుమ్మగూడెం వరకు 4.5 కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని పీఆర్ ఏఈ రఘు చెప్పారు. టీడీపీ నాయకులు కలకొండ భాస్కరరావు, పలగాని దుర్గారావు, ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుమార్తె చదువుకు ఆర్థిక సాయం

కైకలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కుమార్తె విద్యాభివృద్ధికి తోటి స్నేహితులు రూ.1,86,500 అందజేశారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈ ఆర్థిక సాయం అందించారు. బుధవారం లోకుమూడిలోని పూర్వ విద్యార్థి బూరుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముంతా ప్రసాద్ కుమార్తె ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో ఆమె విద్యాభివృద్ధికి ఈ ఆర్థిక సహకారాన్ని అందించారు. పూర్వపు విద్యార్థులైన పెనుమాల మురళీకృష్ణ, తెంటు సతీష్, పళ్లెం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



నూజివీడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని 25వవార్డు, అజరయ్యపేట, యానాదుల కాలనీల్లో బుధవారం పురపాలక సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వారంరోజులుగా మంత్రి కె.పార్థసారథి ఆదేశాల మేరకు పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలను మున్సిపల్ సిబ్బందితో కలిసి మంత్రి కార్యాలయ పీఏలు, ఓఎస్‌డిలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఈ వార్డుల నుంచి చెత్త తీసుకువెళ్ళే ట్రాక్టర్లు వారానికి ఒకరోజు కూడా రావడం లేదని, మురుగునీటి కాలువలు పూర్తిగా పూడిపోయాయని, దోమలు పెరిగి దుర్వాసన వస్తోందని, జ్వరాలు విపరీతంగా పెరిగాయని ఫిర్యాదులు రావడంతో బుధవారం పురపాలక సిబ్బంది, మంత్రి కార్యాలయ సిబ్బంది ఈ వార్డుల్లో శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువల్లో చెత్తాచెదారం వేసిన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పురపాలక సిబ్బంది హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు అవసరమని, త్రాగునీటి కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడం వంటి విషయాలను ప్రజలు వీరి దృష్టికి తేగా ఒకటి, రెండురోజుల్లో ఈ సమస్య కూడా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మంత్రి ఓఎస్‌డి ప్రకాశరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేను వేగవంతం చేయండి



కైకలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని ఉన్న భూములు, భవనాలను స్వమిత్వ సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని ఏలూరు డీఎల్డీవో ఏపీపీవి లక్ష్మీ అన్నారు. బుధవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో స్వమిత్వ సర్వేను ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఈ సర్వే వల్ల భూ వివాదాలు ప్రభుత్వ భూమి ఆక్రమణలు గుర్తించి పరిష్కార మార్గాలు చూపవచ్చన్నారు. గ్రామ కంఠం భూములకు హక్కులు కల్పించే విధంగా ప్రభుత్వం గుర్తింపుకార్డులు అందిస్తారన్నారు. డీఎల్పీవో వై. అమ్మాజీ, ఎండీవో రామకృష్ణ, ఏవో కె బాలశంకరరావు, ఈవోపీఆర్డీ ఎం. రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కలిదిండి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం సానారుద్రవరం, గోపాలపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో సాగు చేసే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చునని, పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలపడాలి



ఏలూరులో జరిగిన శోభాయాత్రలో మాధవ్, ఎమ్మెల్యే కామినేని, తపనా చౌదరి, అంబికా కృష్ణ తదితరులు

- అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తాం
- ఆక్వా, నిమ్మ మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగు పరుస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఏలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'బీజేపీలో బూత్‌స్థాయి నుంచి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. ఒక కార్యకర్తగా ఉంటూ అంచెలంచెలుగా రాష్ట్ర పగ్గాలు అందు కున్న నేనే అందుకు ఉదాహరణ' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. సారథ్యం యాత్రలో భాగంగా ఆయన బుధ వారం ఏలూరులో పర్యటించారు. ఉదయం ఏలూరు బిర్లాభవన్ సెంటర్‌లో ఛాయ్ పే చర్చ లో పాల్గొని పేదల సమస్యలను అడిగి తెలు సుకున్నారు. అణగారిన వర్గాల గుర్తింపునకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని స్వాతంత్ర్య సమరయోధుడు మూర్తి రాజు విగ్రహానికి, పాత బస్టాండ్ వద్ద బీఆర్ అం బేడ్కర్ చిత్రపటానికి మాధవ్, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, గారపాటి తపనాచౌదరి, అంబికా కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్ నుంచి జూట్‌మిల్లు వరకు బ్యాండ్ మేళాలు, నృత్యప్రదర్శనలు, నాయకులు, కార్య కర్తలతో కలసి మోదీ మాస్కులను ధరించి సాగిన శోభాయాత్రను నగరంలో రక్తి కట్టిం చారు.

ప్రజల్లో మమేకం కావాలి

బైపాస్ రోడ్డులో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అధ్యక్షతన సారథ్యం - జిల్లా పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ 'త్యాగం, కృషి, పట్టుదల, క్రమ శిక్షణ, బలిదానాలే ప్రధాన ఆయుధంగా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మమేకం కావాలి. రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధి పథకాల్లో సింహభాగం కేటా యించడంలో మోదీ ప్రభుత్వం ముందుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలి. పోలవరం ప్రాజెక్టు మరింత వేగవంతానికి రూ.15 వేల కోట్లు కేంద్రం ఇచ్చింది. కొల్లేరులో మూడు లక్షల మంది పేదలకు న్యాయం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం సమిష్టి కృషి వలన రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చా యి. ఆక్వా, నిమ్మ ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరుస్తాం. ఆక్వా కల్చర్ అభ్యు న్నతి, రవాణా, ఇతర సౌకర్యాలకు రాబోయే రోజుల్లో రూ.550 కోట్లతో ఒక ప్రణాళికను రూపొందిస్తాం. జిల్లాలో అపరిష్కృత సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తా'మని మాధవ్ అన్నారు.

కొల్లేరు సమస్య పరిష్కరించాలి

బీజేపీ కార్యకర్తగా పనిచేయడం వల్లే 11 ఏళ్లలో ఎంతో మంది జిల్లా నుంచి నేతలు జాతీ య స్థాయిలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఎదిగిన విషయాన్ని గుర్తెరిగి.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్దులు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపనా చౌదరి, నిర్మలా కిషోర్ అన్నారు. 'కొల్లేరు కాంటూ రు కుదింపు సమస్యను పరిష్కరించాలి. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అప్రోచ్ రోడ్లు నిర్మాణం చేపట్టాల'ని జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ కోరారు. నీతి నిజాయితీలతో నిబద్ధతతో పనిచేస్తున్న నాయ కులను వెతికి వారికి పదవులు ఇచ్చి సముచిత గౌరవం ఇస్తున్న పార్టీ బీజేపీయే.. అందుకు నిదర్శనం బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లే అని పార్టీ రాష్ట్ర ముఖ్య ఆహ్వానితులు అంబికా కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. కొల్లేరు కాంటూరు కుదింపు సాధ్యం కాదని, అయితే జిరాయితీ, పట్టా భూముల్లోని వేలాది మందికి న్యాయం చేసే పని కేంద్రం చేస్తుందని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సాయంత్రం కొత్తబస్టాండ్ ప్రాంతంలో అంబికా కృష్ణ ఆధ్వర్యంలో మేధావులు, పురప్రముఖులు, పారిశ్రామికవేత్తల తోను మాధవ్ సమావేశం అయ్యారు. సెంట్రల్ కమిటీ సభ్యులు మధుకర్‌జీ, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు సునీల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు శరణాల మాలతీరాణి, రాష్ట్ర కార్య దర్శులు లక్ష్మీప్రసన్న నాగోతి రమేష్ నాయుడు, జిల్లా కార్యదర్శి గాది రాంబాబు, కొరశ్ల సుధాక రకృష్ణ, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి నరేంద్రప్రకాష్, కట్నేని లక్ష్మీప్రసాద్, ఇందుకూరి అశోక్‌చక్రవర్తి, కారంకి శ్రీనివాస్, నగరపాటి సత్యనారాయణ, గుమ్మడి చైతన్య, నారాయణ పాల్గొన్నారు.



కైకలూరు నుంచి కామినేని ఆధ్వర్యంలో..



మాధవ్‌కు ముదినేపల్లి మండల నాయకుల సత్కారం



తరలివెళుతున్న నూజివీడు బీజేపీ శ్రేణులు

ఏలూరు తరలిన బీజేపీ శ్రేణులు

కైకలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరులో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. బుధవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నుంచి మసీదు వరకు పాదయాత్రగా వెళ్లి అక్కడి నుండి భారీగా కార్లలో, బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత పీవీఎన్ మాధవ్ మొట్టమొదటిసారిగా జిల్లాకు వస్తున్నారని ఇంత పెద్దఎత్తున బీజేపీ శ్రేణులు తరలివెళ్లడం అభినందనీయమన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం నుంచి బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షుడు పసుపులేటి నరసింహారావు, కొత్తపల్లి వెంకటపతిరాజు, మేలిమి చిట్టిబాబు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు బండారు పాండు రంగారావు, వత్తుమిల్లి ప్రసాద్ తదితరుల నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు ముదినేపల్లిలో ప్రదర్శన అనంతరం ఏలూరు తరలి వెళ్లారు. ఏపీ బీజేపీ అధ్యక్షులు మాధవ్‌ను సత్కరించారు.

చాట్రాయి: ఏలూరులో శోభాయాత్రకు చాట్రాయి మండలం నుంచి బీజేపీ నాయకులు కార్యకర్తలు తరలివెళ్ళారు. చాట్రాయి హనుమాన్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూజలు చేసి కార్లలో తరలివెళ్ళారు.

నూజివీడు: నూజివీడు బీజేపీ శ్రేణులు మాధవ్‌కు స్వాగతం పలకటానికి ఏలూరు తరలి వెళ్ళినట్లు ఆ పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి తెలిపారు. వాహనాలపై పెద్దసంఖ్యలో కార్యకర్తలు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బోను అప్పారావు, ఎస్.వసుందరాదేవి, నాగరాణి, జిల్లాకోశాధికారి మాటూరి రవికాంత్, బీజేపీ నాయకుడు వై.ఎస్ దొర్రె, ఎం.రాజశేఖర్, మాటూరి ప్రసాద్‌ల నాయకత్వంలో తరలివెళ్ళారని ఆమె తెలిపారు.



విరాళాలు అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

రాజధాని నిర్మాణానికి పారిశుధ్య కార్మికుల విరాళం

ముదినేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి తమవంతు విరాళాలిచ్చి సహకరించాలన్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఇచ్చిన పిలుపునకు ముదినేపల్లి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు స్పందించారు. తమకు వస్తున్న వేతనం నుంచి రూ.116లు రాజధాని నిర్మాణానికి విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు 16 మంది తమ విరాళాన్ని ఏపీసీఆర్‌డిఏ బ్యాంక్ అకౌంట్ క్యూఆర్ కోడ్‌కు పంపించారు. వారితోపాటు పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇతర సిబ్బంది కూడ తమ విరాళాన్ని పంపారు. రాజధాని నిర్మాణంలో భాగస్వాములైన పారిశుధ్య కార్మికులను వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ అభినందించారు. స్థానిక ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఈడే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారుశుధ్యం మెరుగుకు చర్యలు

ముసునూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారుశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో బీఏ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ముసునూరు, కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి తదితర గ్రామాల్లో రహదారులపై చెత్త చెదారం, మురుగునీటి నిల్వలను సైతం తొలగించి బ్లీచింగ్ చల్లించారు. అలాగే దోమల నివారణమందును పిచికారీ చేయించారు. జ్వరాల వ్యాప్తిని నివారించేందుకు ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపడుతున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

ఎంఈవోను కలిసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

మండవల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండవల్లి ఎంఈఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను మండవల్లి మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం కలిసి అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పాఠశాలల నిర్మాణాలు పూర్తయ్యేల కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గణనాథుడి ఊరేగింపు

కైకలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామాల్లో వినాయక ఊరేగింపులను భారీగా నిర్వహిస్తున్నారు. బుధవారం కైకలూరు మండలం ఆటపాక శివారు రెడ్డినగర్‌లో వేంచేసియున్న శ్రీఆదివినాయక స్వామివారి ఊరేగింపును నిర్వహించారు. తీన్మార్ డప్పువాయిద్యాల నడుమ గ్రామపురవీధుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. కైకలూరు వైఎస్సార్ కాలనీలోని ఆంజనేయస్వామి గుడివద్ద, కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద, ఆటపాక శివాలయం వద్ద, సంతమార్కెట్ వద్ద వినాయకచవితి ఉత్సవాల వద్ద భక్తులకు అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

ముదినేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ప్రేమ కలాపాలు సాగించిన యువకుడు చివరికి ఓ యువతిని నట్టేట ముంచిన ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి 2020లో గుడివాడలోని ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ కోసం వెళ్ళగా అదే కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు వచ్చిన జంగారెడ్డిగూడెం మండలం కొయ్యలగూడెంకు చెందిన ఎ. దివాకర్ అనే యువకుడు ఆ యువతిని పరిచయం చేసుకున్నాడు. అనంతరం ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్ళి చేసుకుంటానని ఆ యువతిని నమ్మించి 2024లో తాను గుడివాడలో అద్దెకు ఉంటున్న రూముకు తీసుకెళ్ళడం ప్రారంభించాడు. తనతో దివాకర్ శారీరక సంబంధం పెట్టుకున్నట్లు యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. ఆమె తల్లి కూడా ఆ యువకుడిని నిలదీయగా అతని కుటుంబ సభ్యులతో సహావచ్చి ఇటీవల పెళ్ళి చేసుకుంటామని చెప్పి వెళ్ళారని, అయితే ఇప్పుడు పెళ్ళికి నిరాకరిస్తున్నారని, తనను మోసం చేశారని ఆ యువతి ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.



విజేతలతో ఉపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో అంధ విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన 14వ జాతీయ స్థాయి పారా ఒలింపిక్స్‌లో జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో తోటపల్లిలోని హీల్ అంధ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 7 పతకాలు సాధించి, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధపడుతున్నారని ప్రిన్సిపాల్ యార్లగడ్డ లత అన్నారు. జూనియర్స్ విభాగంలో జాలా వరలక్ష్మి డిస్కస్‌త్రోలో బంగారు పతకం, లాంగ్ జంప్‌లో రజత పతకం, చింతల ప్రవీణ్ 200 మీటర్లు పరుగు పందెంలో రజత పతకం సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో సిహెచ్ హరి లాంగ్‌జంప్‌లో రజతం, 200 మీటర్ల పరుగు పందెంలో రజతం, 100 మీటర్ల పరుగు పందెంలో కాంశ్య పతకం, సిహెచ్ రోహిత్ జావలిన్ త్రోలో రజతం సాధించారు. హీల్ సిఈవో కూరపాటి అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మిక్కిలినేని హరీష్, అంధ పాఠశాల ఇన్‌ఛార్జ్ కె.అబ్రహం, కోచ్ ఎ. శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఇన్‌ఛార్జ్ ఎస్.నాగరాజు తదితరులు విజేతలను అభినందించారు.

లో వోల్టేజ్ సమస్య పరిష్కారం

ముసునూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట దళితవాడలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారమైంది. గత నెల 29న లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపిన విషయం విదితమే. ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ యుద్ధప్రాతిపదికన ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి, మూడు రోజుల్లో స్తంభాలను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ఏఈ మాట్లాడుతూ ఎస్సీకాలనీ నుంచి బీసీకాలనీ వరకు విద్యుత్ సప్లైకి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల అధిక లోడ్‌తో లో వోల్టేజ్ సమస్య తలెత్తిందన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పూర్తిగా సమస్య తొలిగిందని తెలిపారు. రమణక్కపేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

జనసేనలో చేరిక

నూజివీడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణ ఎస్సీవర్గానికి చెందిన పలువురు నాయకులు బుధవారం జనసేనలో చేరారు. ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివకృష్ణ ఆధ్వర్యంలో చింతల సంజయ్ బృందం జనసేనలో చేరారు.

రీ సర్వేలో అభ్యంతరాలపై 25 అర్జీలు

ముసునూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెంలో జరిగిన రీ సర్వే అభ్యంతరాలపై తహసీల్దార్ దాసరి ప్రశాంతి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తమ శర్మ రీ సర్వే వివరాలను సభలో వివరించగా, అభ్యంతరాలపై 25 మంది రైతులు ఆర్జీలు ఇచ్చారు. ఆర్జీలను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.





స్త్రీ శక్తి అభినందన కార్యక్రమ సభలో పాల్గొన్న మహిళలు.. హాజరైన టీడీపీ నాయకులు

చంద్రబాబుకు ఎల్లప్పుడూ అండగా ఉండండి

స్త్రీ శక్తి అభినందన సభలో మంత్రి సారథి

నూజివీడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ చేతకానితనం వల్ల రూ.10లక్షల కోట్లు అప్పులుచేసి రాష్ట్రాన్ని నాశనం చేశారని, మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ కావడంతో పాటు మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకు కృతజ్ఞతగా స్థానిక రోటరీ కల్యాణ మండపంలో జరిగిన అభినందన సభలో ఆయన వర్చువల్‌గా మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రూ.8 లక్షల కోట్లు పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సహకార సంఘాలు, నియోజకవర్గంలో ఇప్పటికే సీఎం సహాయనిధి నుంచి సుమారు రూ.6కోట్లు అందించామన్నారు. పట్టణంలో సిలువ గట్టు అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేశామని, ఆగిరిపల్లి దేవాలయం అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించటం జరిగిందన్నారు. నాడు ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించగా, చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారి మహిళలకు అనేక రకాలుగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించారని, ఈ విషయాన్ని మహిళలు గుర్తుంచుకుని చంద్రబాబుకు ఎప్పుడూ అండగా నిలవాలని మహిళలకు చేశారు. ఆరోగ్యరీత్యా మంత్రి స్వయంగా పాల్గొనలేకపోవడం వల్ల ఆయన కుమారుడు నితిన్‌కృష్ణ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. పెద్దసంఖ్యలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు హాజరయ్యారు.

పంచాయతీలకు పండుగ..

(5వ పేజీ తరువాయి)

సంబంధించి 15వ ఆర్థిక సంఘ నిధులు విషయానికొస్తే గతంలో మొదటి విడత నిధులు కూడా విడుదల కాలేదు. ఇప్పుడు రెండు విడతల నిధులు ఒకేసారి విడుదల అయ్యాయి. 15వ ఆర్థిక సంఘం రెండు విడతలు కలిపి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌కు 21 కోట్ల 99లక్షల 60వేల 360 రూపాయలు విడుదల అయ్యాయి. ఇందులో మొదటి విడత నిధులు 13,76,87,261 రూపాయలు కాగా ఇందులో అన్‌టైడ్ నిధులు రూ.5,50,73,271, టైడ్ నిధులు రూ.8,26,13,990 విడుదల అయ్యాయి. రెండో విడత నిధులు రూ.8,22,73,099 నిధులు విడుదల కాగా ఇందులో అన్‌టైడ్ నిధులు 3,29,09,240 రూపాయలు, టైడ్ నిధులు రూ. 4,93,63,959 విడుదల అయ్యాయి.

మండల పరిషత్‌లకు రూ.16.50 కోట్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి రెండోవిడత గ్రాంట్ మొత్తం రూ.16,50,97,853 నిధులు విడుదల అయ్యాయి. ఇందులో అన్‌టైడ్ నిధులు రూ.6,60,39,122, టైడ్ నిధులు రూ.9,90,58,731 విడుదల అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంది.

అధ్వానంగా శ్మశాన వాటికలు

(నూజివీడు - ఆంధ్రజ్యోతి)

నూజివీడు పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలు అధ్వానంగా అడుగుపెట్టడానికి కూడా వీలు లేని పరిస్థితుల్లో ఉన్నాయి. అయినా గత్యంతరం లేక అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. పదేళ్ళ నుంచి వీటి పరిస్థితిని మెరుగుపరచాలని, కొన్ని శ్మశాన వాటికలు ఆక్రమణకు సైతం గురయ్యాయని, వాటిని గుర్తించి, సర్వే నిర్వహించాలని పలువురు పురపాలక అధికారులకు తెలిపినా, ఇంతవరకు ఈ సమస్యపై పురపాలకం దృష్టి సారించలేదు. అనేక పట్టణాల్లో హిందూ శ్మశాన వాటికలను ఆధునికీకరిస్తున్నారు. అయితే ఇక్కడా పరిస్థితి లేదు.

పలు చోట్ల ఆక్రమణలు..

నూజివీడు పట్టణ పరిధిలోని రామన్నగూడెం రోడ్డులో గల హిందూ శ్మశాన వాటిక విస్తీర్ణం, అధికారికంగా 6 ఎకరాల 8 సెంట్లు, తిరువూరు రోడ్డులోని వాటిక విస్తీర్ణం నాలుగు ఎకరాల 55 సెంట్లు, ఆటోనగర్ రోడ్డులోని శ్మశాన వాటిక విస్తీర్ణం ఎకరం 68 సెంట్లు, మైలవరం రోడ్డులోని వాటిక విస్తీర్ణం 25 సెంట్లు, రేగుంట రోడ్డులోని శ్మశాన వాటిక 7 ఎకరాల 47 సెంట్లు విస్తీర్ణంలో ఉండగా, వీటిలో కొన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రహరీ నిర్మాణంలో లోపాలు..

ఎక్కడైనా శ్మశాన వాటికలో శవదహన కార్యక్రమాలు బయటకు కనిపించకుండా ప్రహరీ గోడలు నిర్మిస్తారు. విజయవాడ - ఆగిరిపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్మశాన వాటిక (రామన్నగూడెం రోడ్డు)వద్ద మాత్రం రహదారివైపు కాకుండా శ్మశాన వాటిక చివర ఒక పక్కన పొలాల వైపు ప్రహరీ గోడను పురపాలక సంఘం వారు ఎందుకు కట్టారో వారికే తెలియాలి. శ్మశాన వాటికల్లో షెడ్లు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి.



అధ్వానంగా నూజివీడు హిందూ శ్మశాన వాటిక

దాతలు సౌకర్యాలు సమకూరుస్తామన్నా..

శ్మశాన వాటికల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించటానికి పలువురు దాతలు సంసిద్ధంగా ఉన్నారు. సౌకర్యాలు కల్పనకు అవసరమైన నిధులను సమకూర్చుతామని గతంలోనే పురపాలక అధికారులకు దాతలు విజ్ఞప్తి చేసి ఏళ్ళు గడుస్తున్నా అధికారులు మాత్రం ఈ విషయంపై దృష్టిపెట్టడం లేదు. మంత్రి పార్థసారథి ఈ శ్మశానాల దుస్థితిని మెరుగుపరిచేలా దృష్టిపెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.